రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

Bhavani Publication Trust https://prajatheerpudaily.com
APTEL/2001/5268

# ప్రజాతీర్పు

The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 24 | సంచిక : 360 | హైదరాబాద్ | శుక్రవారం 13 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# జమిలీకి సై



### ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు

### రాజ్యాంగ విరుద్ధమంటున్న ప్రతిపక్షాలు

## జమిలీకి క్యాబినెట్ ఆమోదం

**'ఒకే దేశం ఒకే ఎన్నిక'కు సంబంధించిన ముసాయిదా బిల్లుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశమైంది. ఈ ముసాయిదా బిల్లును ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఆ తరువాత సంబంధిత పార్లమెంటరీ కమిటీకి పంపే అవకాశం ఉంది. ఈ కమిటీ ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభల స్పీకర్లను కూడా సంప్రదించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ)

'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' ప్రణాళికతో ముందుకెళ్తున్న ప్రభుత్వం లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతస్థాయి కమిటీ చేసిన సిఫారసులకు సెప్టెంబరులోనే కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీ దేశవ్యాప్తంగా అభిప్రాయాలను సేకరించిన తరువాత 11 సిఫారసులు చేసింది. కాగా జమిలీ రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

**కమిటీ చేసిన 11 సిఫార్సులు**

ప్రతి సంవత్సరం తరచూ ఎన్నికలు నిర్వహించడం ఆర్థిక వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ భారాన్ని తగ్గించడానికి ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి. మొదటి దశలో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఖరారు చేస్తారు. అనంతరం, 100 రోజుల్లోపు మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల తరువాత లోక్‌సభ సమావేశమయ్యే తేదీని 'నిర్ణీత తేదీ'గా ప్రకటిస్తూ రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేయవచ్చు. వచ్చే సార్వత్రిక ఎన్నికలకు అనుగుణంగా కొత్తగా ఏర్పడే రాష్ట్రాల అసెంబ్లీల కాలపరిమితి తగ్గుతుంది. ఈ సంస్కరణలను పర్యవేక్షించడానికి, విజయవంతంగా అమలు చేసేలా చూడటానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని కమిటీ సిఫారసు చేస్తుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా ఆర్టికల్ 324ఏ సవరణను ప్రవేశపెట్టాలని, అన్ని ఎన్నికలకు ఏకీకృత ఓటరు జాబితా, ఫొటో ఐడీ కార్డును రూపొందించేందుకు ఆర్టికల్ 325కు సవరణ

- మిగతా 2వ పేజీలో

# రహదారుల అభివృద్ధికి సహకరించండి



## త్రిబుల్ ఆర్‌కు సాంకేతిక, ఆర్థిక అనుమతులివ్వండి

### హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి

### హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసల విస్తరణకు డీపీఆర్ ఆమోదించండి

### జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి

(ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ)

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి (159 కిలో మీటర్ల) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులను వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి సమావే శమయ్యారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161 ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని సీఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణా నికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరా బాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్-765లో

- మిగతా 2వ పేజీలో



## మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం అధిష్టానిదే

### హైడ్రాకు ధనిక, పేద తేడాలు లేవు

### అప్పులు కడుతూ అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం

### సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలు

### ఢిల్లీ మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

(ప్రజాతీర్పు ప్రతినిధి, ఢిల్లీ)

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్టానిదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై చర్చించేందుకు తాను ఢిల్లీకి వచ్చినట్టు పలు పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండించారు. అసలు ఢిల్లీ పర్యటనలో రాహుల్ గాంధీని కలవలేదని క్లారిటీ ఇచ్చారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గురువారం ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని కాంగ్రెస్ ఎంపీలతో కలిసి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ భేటీలో ఎంపీలు మల్లు రవి, చామల, కడియం కావ్య, బలరాం నాయక్, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మీడియా మిత్రులతో డిప్యూటీ సీఎం కాసేపు చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అప్పులకు 11 నెలల్లో రూ. 64 వేల కోట్లు

- మిగతా 2వ పేజీలో

# రైతులకు బేడీలా?

## లగచర్ల రైతుకు సంకేళ్లు వేయడం పట్ల కేటీఆర్ ఆగ్రహం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయడం పట్ల బీఅర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చిన రైతన్నకు సంకెళ్లు వేయడం దారుణమని , రేవంత్ రెడ్డి క్రూరమనస్తత్వానికి నిదర్శనమని ఆరోపించారు. హీర్యా నాయక్ కి గుండెల్లో నొప్పి వస్తే వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం అలసత్వం చూపిందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని కుటుంబ సభ్యులకు, బయటకు చెప్పకుండా దాచిపెట్టే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. సకాలంలో ఆసుపత్రికి తరలించకుండా అమానవీయంగా వ్యవహరించిందని విమర్శించారు. గురువారం ఉదయం రెండోసారి మళ్లీ గుండెపోటు రావడంతో అతడిని సంగారెడ్డి ఆసుపత్రికి

- మిగతా 2వ పేజీలో



## జగజ్జేత గుకేశ్



8లో

**జగజ్జేత గుకేశ్ అద్భుతం ఆవిష్కృతమైంది! ప్రపంచ చదరంగంపై భారత మువ్వన్నెల పతాకం సగర్వంగా రెపరెపలాడింది. అంచనాలకు మించి రాణిస్తూ అతి పిన్న వయసులో(18 ఏండ్లు)నే భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ వరల్డ్ చాంపియన్ కిరీటం కైవసం చేసుకున్నాడు.**

## హాస్టల్ వార్డెన్లకు కాదు.. రేవంత్ రెడ్డికి శిక్ష వేయాలి

### హరీశ్‌రావు ఆగ్రహం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

రేవంత్ రెడ్డి ఏడాది పాలనతో గురుకులాలు, హాస్టళ్ళు అన్ని ఆగమైపోయిన పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీశ్‌రావు తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనలో వేలాదిమంది విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం 49 మంది విద్యార్థులను పొట్టన పెట్టుకుందని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రశాంత్ నగర్ ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ



హాస్టల్‌ను హరీశ్‌రావు గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా

- మిగతా 2వ పేజీలో

## రైతుకు బేడీలు

### పోలీసుల తీరుపై సీఎం సీరియస్

### సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల అన్నదాతకు గుండెపోటు

### గతంలోనే గాంధీలో వైద్య పరీక్షలు చేయించిన జైలు సిబ్బంది

### ఇంటి వద్ద ఉన్నపుడే అనారోగ్యం

### బేడీలతో ఆస్పత్రికి తరలించిన పోలీసులు

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఫార్మా సిటీ భూ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్కోట జరిగిన దాడి కేసులో అరెస్టయి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న లగచర్ల రైతుకు గుండెపోటు వచ్చింది. రైతు



హీర్యా నాయక్ జైల్లో అనారోగ్యం పాలవడంతో వైద్య పరీక్షలు చేస్తుండగా గుండెపోటు వచ్చిందన్న విషయం గుర్తించారు. దాంతో జైలు సిబ్బంది బుధవారం రాత్రి హుటాహుటిన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మూడు రోజుల ముందే ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లిన జైలు సిబ్బంది వైద్య పరీక్షలు

- మిగతా 2వ పేజీలో



3

**ఆ టైంలో నా ముఖం దాచేసుకుంటున్నా : కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**



3

**ప్రార్థనా స్థలాల సర్వేలపై స్టే**
**ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటుపై విచారణ**



**తిరుచ్చి రంగనాథర్ ఆలయానికి వజ్రాల కిరీటాన్ని విరాళంగా ఇచ్చిన ముస్లిం కళాకారుడు**



# జమిలీకి సై

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని కమిటీ ప్రతిపాదించింది. ఒకవేళ హంగ్ ఏర్పడితే లేదా అవిశ్వాస తీర్మానం ఏర్పడితే కొత్తగా ఎన్నికలు జరుగుతాయి. కానీ కొత్తగా ఎన్నికైన సభ కాలపరిమితి వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. తొలిదశలో లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో, లోక్‌సభ ఎన్నికలకు వంద రోజుల్లోనే రెండో దశలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. హంగ్ సభ లేదా అవిశ్వాస తీర్మానం విషయంలో కొత్తగా ఎన్నికలు నిర్వహిస్తారు. కొత్తగా ఎన్నికైన లోక్‌సభ ఐదేండ్లు కొనసాగదు. గతంలో ఏర్పడిన సభకు సంబంధించి మిగిలిన పదవీకాలాన్ని మాత్రమే కొనసాగిస్తుంది. సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు, వీవీప్యాట్ వంటి నిత్యావసర పరికరాల కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఎన్నికల కమిషన్‌కు సూచించారు. అన్ని ఎన్నికలకు ఏకీకృత ఓటరు జాబితా, ఓటరు ఐడి కార్డు వ్యవస్థను కమిటీ ప్రతిపాదిస్తుంది, దీనికి రాష్ట్రాల ఆమోదానికి లోబడి రాజ్యాంగ సవరణ అవసరం.

# రహదారుల అభివృద్ధికి సహకరించండి

(మొదటి పేజీ తరువాయి)

125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. అమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024-25 బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్-63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి దేవాలయం, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరి, కష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న పది చోట్లా పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్లగొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.




# ఏపీలో పింఛన్‌దారులకు షాక్.. వారి నుంచి రికవరికి ఆదేశాలు

ఏపీలో కూటమి ప్రభుత్వం పింఛన్‌దారులకు షాక్ ఇవ్వనుంది. అనర్హుల నుంచి తీసుకున్న పింఛన్ డబ్బులను రికవరీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహిస్తున్న సదస్సులో రెండో రోజు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఇందులో భాగంగా సామాజిక పింఛన్లలో సుమారు 6 లక్షల మంది రాష్ట్రవ్యాప్తంగా అనర్హులున్నారని స్వయాన సంబంధిత మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించడంతో ప్రభుత్వం షాక్‌కు గురయింది. రాష్ట్రంలో మొత్తం 64 లక్షల మంది అన్ని రకాల పింఛన్‌దారులుండగా దివ్యాంగుల కోటాలో అత్యధికంగా అనర్హులున్నారంటూ సదస్సులో వివరించారు. అయితే వైసీపీ హయాంలో సదరం క్యాంపులు నిర్వహించి మార్గదర్శకాలను ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా సర్టిఫికేట్లు జారీ చేశారని గుర్తించిన కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ చేపట్టిన అధికారులు 10,958 పింఛన్లలో సుమారు 563 మంది అనర్హులున్నట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. దీంతో స్పందించిన ప్రభుత్వం గురువారం నాటి కలెక్టర్ల సమావేశంలో అనర్హులపై కీలక ఆదేశాలు జారీ చేసింది. రానున్న మూడు నెలల్లో పింఛన్ తీసుకున్న అనర్హుల గుర్తించి వారి నుంచి రికవరి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ తరువాత కూడా అనర్హులు తేలితే కలెక్టర్లను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు చనిపోయిన చిన్నారులకు పింఛన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

## హాస్టల్ వార్డెన్లకు కాదు..

# రేవంత్ రెడ్డికి శిక్ష వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వసతీగృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నటువంటి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ పిల్లలకు కడుపునిండా అన్నం పెట్టే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదని విమర్శించారు. కేసీఆర్ 1000 పైగా గురుకులాలు స్థాపించి గురుకులాల గౌరవాన్ని ఎవరెస్టు శిఖరం అంత ఎత్తులో పెట్టారని హరీశ్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ళకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని చెప్పారని అన్నారు కానీ.. ఈ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు జూన్ నుంచి నవంబర్ వరకు ఆరు నెలలుగా మెస్ చార్జీల చెల్లింపులు జరగలేదని పేర్కొన్నారు. దాదాపు 9.50 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. హాస్టల్ వార్డెన్లు బంగారం కుదవబెట్టి అప్పులు తెచ్చి విద్యార్థులు ఆకలి తీరుస్తున్నారని తెలిపారు. మెస్ చార్జీలు సకాలంలో చెల్లించకపోతే విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎలా పెడతారని ప్రశ్నించారు. విద్యార్థులు ఆస్పత్రి పాలైతే ఉపాధ్యాయులను, వార్డెన్లను సస్పెండ్ చేస్తా



అంటున్నావ్.. శిక్ష రేవంత్ రెడ్డికి వేయాలని సూచించారు. మెస్ చార్జీలు పెండింగ్‌లో పెట్టింది రేవంత్ రెడ్డి, కాబట్టి శిక్ష ముఖ్యమంత్రికి వేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఇప్పటివరకు మెస్ చార్జీలు విడుదల చేయలేదని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయి కానీ చేతలు గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉందేమో అని వ్యాఖ్యానించారు. గత సంవత్సరం విద్యార్థులకు ప్లేటు, గ్లాసు, స్పూన్, టవల్స్, స్కూల్ యూనిఫార్మ్ అన్ని సకాలంలో అందాయని.. కానీ ఈ సంవత్సరం ఇవేవీ ఇవ్వలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాజీవ్ గాంధీ పుట్టిన రోజుకు రేవంత్ రెడ్డి ఫుల్ పేజీ పేపర్ యాడ్ ఇస్తున్నారు.. తొమ్మిది రోజుల విజయోత్సవాలు జరుపుకున్నారు.. కానీ ఈ పిల్లలకు బుక్కెడు అన్నం పెట్టే చాతకాదా అని మండిపడ్డారు. విద్యార్థులను అర్ధాకలితో ఉంచినందుకు ఏడాది విజయోత్సవాలు చేసుకుంటున్నావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడపిల్లల హాస్టళ్లలో చలికాలం వేడి నీళ్లు రాక ఇబ్బంది పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో అక్టోబర్, నవంబర్ మెస్ బిల్లులు పెండింగ్ ఉన్నాయని పేర్కొన్నారు. పార్ట్ టైం ఉద్యోగులకు 8 నెలలుగా జీతాలు ప్రభుత్వం ఇవ్వడం లేదని అన్నారు. 8 నెలల నుంచి జీతాలు చెల్లించకపోతే వారు ఎలా పని చేస్తారు? వాళ్ల కుటుంబాన్ని ఎలా పోషిస్తారని ప్రశ్నించారు. ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ఆరు నెలలుగా కాస్మెటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. ఇదీ రేవంత్ రెడ్డి ఏడాది పాలన అని విమర్శించారు. కోతలు ఎక్కువ చేతలు తక్కువ అని ఎద్దేవా చేశారు. వికారాబాద్ జిల్లా

# రైతులకు బేడీలా?

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువెళ్లారని పేర్కొన్నారు. ఆయనతో పాటు రాఘవేంద్ర, బసప్ప ఆరోగ్యం కూడా తీవ్రమైన ఇబ్బందుల్లో ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుడు పట్నం నరేందర్ రెడ్డి కి అనేక ఆరోగ్య సమస్యలు ఉన్నాయని వెల్లడించారు. గుండెపోటు వచ్చిన రైతుకు ప్రభుత్వం స్ట్రెచర్ మీదనో, అంబులెన్స్ మీదనో తీసుకురావాల్సి ఉండగా బేడీలు వేసి తీసుకురావడం శోచనీయమని అన్నారు. రాజ్యాంగంలోని 14, 16, 19 ఆర్టికల్స్ ప్రకారం వారి హక్కులను హరించడమే నని స్పష్టం చేశారు. నూతన క్రిమినల్ చట్టం బిఎన్ఎస్ఎస్ ప్రకారం కూడా, పోలీస్ మాన్యువల్స్, జైల్ మాన్యువల్స్ ప్రకారం అండర్ ట్రయల్స్ ఖైదీల హక్కులను హరించడమేనని వెల్లడించారు.

**గవర్నర్ విచారణకు ఆదేశించాలి**

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని కోరారు. రాష్ట్ర గవర్నర్ ఈ అంశం లోని తగిన విచారణకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి జైపూర్‌లో విందులు, వినోదాలలో జల్సాలు చేసుకుంటూ చిందులు చేసుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ గిరిజన రైతులు మాత్రం జైళ్లలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని తెలిపారు. రాహుల్ గాంధీకి నిజంగానే హృదయం ఉంటే, గిరిజనుల పట్ల ప్రేమ ఉంటే రైతులపై పెట్టిన కేసులు రద్దు చేయాలని ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చేతకాకుంటే జైలులో ఉన్న లగచర్ల రైతులకు అవసరమైన వైద్య సహకారాన్ని, సహాయన్ని పార్టీ తరఫున అందిస్తామని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మానవత్వంతో వ్యవహరించాలని, భేషజాలకు పోకుండా గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకొని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తనపై ఎలాంటి దాడి జరగలేదని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ చెప్పినా కూడా ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్టగా తీసుకొని వారిపై కేసులు పెట్టించడం అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. అదానీకోసం, అల్లుడి కోసం భూములు గుంజుకుంటామంటే ఇవ్వకపోవడమే రైతన్నలు చేసిన ఏకైక తప్పు అని అన్నారు. రేవంత్ రెడ్డి భూదాహం, అహంకారం వల్లే 20 రోజులుగా రైతులు జైళ్లలో మగ్గుతున్నారని వాపోయారు.

# మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం అధిష్టానిదే

(మొదటి పేజీ తరువాయి)

కట్టామని తెలిపారు. రాష్టం ఏర్పడే నాటికి ఏడాదికి రూ.6,400 కోట్లు చెల్లించాల్సి ఉండేదని, కానీ ఇప్పుడు వంద శాతం అప్పులు పెరిగి ఏడాదికి రూ. 64 వేల కోట్లు కట్టాల్సి వచ్చిందన్నారు. ప్రస్తుతం తాము ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనపై దష్టి పెట్టామని, అందుకే ప్రచారంలో వెనకబడ్డామని అన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలకు ఏ పని లేక, తమపై పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కంటే తాము మెరుగైన పాలన అందిస్తున్నామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత హాస్టళ్లలో డైట్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. డిసెంబర్ 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు హాస్టళ్లకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని చెప్పారు.

**సంక్రాతి నుంచి రైతు భరోసా అమలు చేస్తాం**

రైతు భరోసాని సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రకటించామని, ఏది ఏమైనా అమలు చేసి తీరుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రైతు భరోసా, రుణమాఫీ కంటే ఎక్కువగా రైతులకు లబ్ధి చేకూరుస్తున్నామని అన్నారు. తెలంగాణ తల్లి గతంలో అధికారికంగా లేదని, టీఆర్ఎస్ పార్టీ తరఫున మాత్రమే తెలంగాణ తల్లి ఉండేదని అన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రంలో అధికారికంగా తెలంగాణ తల్లికి ప్రాణం పోసినట్లు అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలన్న నిబంధనేమీ లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీ నిబంధనలు మార్చారని గుర్తు చేశారు. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు ధనిక, పేద అనే తేడా లేదన్నారు. ఎవరు చెరువులను ఆక్రమించినా హైడ్రా ఉపేక్షించదని, చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించబోతున్నామని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

# రైతుకు బేడీలు

(మొదటి పేజీ తరువాయి)



చేయించి తీసుకువచ్చారు. మళ్ళీ బుధవారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు హీర్యా నాయక్‌కు ఈసీజీ, 2 డీ ఏకో పరీక్షలు చేశారు. గత నెల 11న వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న ఖైదీ హీర్యా నాయక్ గతంలోనే తనకి గుండె సమస్య ఉన్నట్టు వెల్లడించారు. మూడు నెలల కిందే ఇంటి వద్ద ఆస్పత్రికి వెళ్లగా స్టంట్ వేయాలని వైద్యులు చెప్పారని, తన ఆర్థిక పరిస్థితుల వల్ల సర్జరీ చేయించుకోలేదని తెలిపారు.

**రైతుకు సంకెళ్లు సరికాదు : చింత ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే**

లగచర్ల రైతుకు గుండెపోటు వచ్చి చావు బతుకుల్లో ఉంటే సంకెళ్లు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం దారుణమని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంఘటన తెలవగానే ఆయన ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటే రైతులను జైల్లో పెట్టడం, సంకెళ్లు వేయడమా అని ప్రశ్నించ్చారు.

## తక్షణమే విచారణ చేసి నివేదిక ఇవ్వండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రిమాండ్ ఖైదీ లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండెపోటు వస్తే అతనికి ఖైదీకి వేసిన మాదిరిగా బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం మీడియాలో రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఘటనపై అధికారుల ద్వారా సమాచారం తెలుసుకొని జైలు అధికారులపై సీరియస్ అయ్యారు. రిమాండ్ ఖైదీకి బేడీలు వేయాల్సిన అవసరం ఏముందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. నిందితునికి గుండెపోటు వచ్చి చావు బతుకుల మధ్య ఉంటే కనీసం రైతు అని కూడా చూడకుండా, కరుడుగట్టిన నేరస్తుని మాదిరి సంకెళ్లు వేయడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. జైలు సిబ్బంది తీరు పట్ల సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీకి విమాన సర్వీస్ ప్రారంభం

ఏపీలోని రాజమండ్రి నుంచి నేరుగా ఢిల్లీ, ముంబాయి విమాన సర్వీస్ గురువారం నుంచి ప్రారంభమయ్యింది. ఢిల్లీ నుంచి రాజమండ్రి మధురపూడి ఎయిర్‌పోర్టుకు మొదటిసారిగా వచ్చిన ఇండిగో ఎయిర్ బస్‌లో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు , పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి రాజమండ్రికి వచ్చారు. ఈ సందర్భంగా విమానానికి వాటర్ కెనాన్లతో సిబ్బందితో స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఇంతకుముందు ఢిల్లీకి, విదేశాలకు వెళ్లాలంటే విజయవాడ, విశాఖ, హైదరాబాద్‌కు వెళ్లాల్సివచ్చేదని అన్నారు. ఇకపై ముంబాయి, ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి విదేశాలకు వెళ్లవచ్చని తెలిపారు. కాకినాడు ఎయిర్‌పోర్టు విషయంలో ల్యాండ్‌తో సహా ఫిజిబిల్టిని



పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ తిరుపతి, షిర్డీ, జైపూర్, గుజరాత్ రాష్ట్రాలకు, ప్రధాన నగరాలకు బిజినెస్ కనెక్టివిటీని పెంచడానికి అవకాశముందని అన్నారు. 2027లో రాజమండ్రి పుష్కరాలకు కూడా విమానశ్రయాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు.

# జర్నలిజంలో వృత్తి విలువల పెంపుదల కోసం కృషి చేయాలి






## డబ్ల్యూ జే ఐ లో చేరిన చిగురుమామిడి మండల పాత్రికేయులు

(ప్రజాతీర్పు ప్రతినిధి, కరీంనగర్)

జర్నలిజం వృత్తిలో నానాటికి విలువలు దిగజారి పోతుండడం పట్ల బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తి విలువల పెంపుదల కోసం నవతరం పాత్రికేయులు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన 15 మంది విలేకరులు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాలో చేరారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ విలేకరులు కేవలం వార్త సేకరణకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం కావాల నిసూచించారు. జర్నలిజం రంగంలోకి కొత్తగా వస్తున్న వారికి వృత్తి శిక్షణతో పాటు, డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర , రక్త నిర్ధారణ పరీక్షల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టు సంఘాలకు సంఖ్యా బలమే ముఖ్యం కాదని, నిజాయితీతో, నిబద్ధతతో, పనిచేసే జర్నలిస్టులకు డబ్ల్యూజేఐ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని చెప్పారు. నూతన సంవత్సరంలో డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసమే నిరంతరం పనిచేసే నాయకత్వం వెంట జిల్లాలోని జర్నలిస్టులు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా జర్నలిస్టులకు నిరంతరం తాము అండగా ఉంటామని, వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తామని, వారి కష్ట,సుఖాల్లో భాగస్వాములు అవుతామని తెలిపారు. జర్నలిస్టుల వసుదైక కుటుంబం తమలక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో జిల్లాలోని జర్నలి స్టులందరూ భాగ స్వాములు అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గురువారం చిగురుమామిడి ప్రెస్ క్లబ్ (రిజిస్టర్డ్ నెంబర్ 347/ 2024) అధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్ (నవతెలంగాణ), ప్రధాన కార్యదర్శి రాకం కరుణాకర్ (దిశ) ల ఆధ్వర్యంలో కే బాలయ్య (సాక్షి), పత్తెం రమేష్ (వార్త), మారుపాక రమేష్(ప్రజా సాక్షి), ఎలగందుల రవీందర్ (తెలుగు ప్రభ), తాళ్ల నరేష్ (సిరాన్యూస్), గుడికందుల దేవదాస్ (అక్షరం), బోయిన సంపత్ (వాస్తవం), బొల్ల బత్తిని మహేష్ (ప్రజాదర్బార్ ) ముంజ శ్రీకాంత్ (అక్షర విజేత) తదితరులు డబ్ల్యూజేఐ సభ్య త్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జిల్లా నాయకులు టి సత్య నారాయణ, దారం జగన్నాథ రెడ్డి, ఆడెపు లక్ష్మీనారాయణ, డి ఎస్ ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

## టైమ్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షునిగా ప్రమాణం చేయబోతున్న డొనాల్డ్ ట్రంప్ 'టైమ్స్' మ్యాగజైన్ 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా రెండోసారి ఎంపికయ్యారు. ఈ ప్రకటన వెలువడిన అనంతరం ట్రంప్ గురువారం ఉదయం 9.30 గంటలకు న్యూయార్క్ స్టాక్ ఎక్సేంజ్ ఓపెనింగ్ బెల్‌ను మోగించారు. అంతకుముందు ఆయన స్టాక్ ఎక్సేంజ్‌లో మాట్లాడుతూ, ఇది తనకు లభించిన అద్భుతమైన గౌరవమని తెలిపారు. టైమ్ మ్యాగజైన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ గుర్తింపును 2016లో పొందానని, ఇప్పుడు మరోసారి ఆ గుర్తింపు లభించడం తనకు దక్కిన గొప్ప గౌరవమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రంప్ సతీమణి మెలానియా, ఆయన కుమార్తె ఇవాంక ట్రంప్, వైస్ ప్రెసిడెంట్ ఎలక్ట్ జేడీ వాన్స్ పాల్గొన్నారు.

## ఆ టైంలో నా ముఖం దాచేసుకుంటున్నా: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీ: దేశంలో రోజు రోజుకూ యాక్సిడెంట్ల సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ప్రమాదాల నివారణపై లోక్‌సభలో సమాధానం ఇస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాల్లో జరిగే సమావేశాలకు వెళ్లిన సమయంలో.. రోడ్డు ప్రమాదాలపై చర్చ జరుగుతున్నప్పుడు.. తన ముఖాన్ని దాచుకునేందుకు ప్రయత్నిస్తానని మంత్రి పేర్కొన్నారు. తొలి సారి కేంద్ర రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో .. ప్రమాదాలను 50 శాతం వరకు తగ్గించేందుకు టార్గెట్ పెట్టుకున్నానని, కానీ ప్రమాదాలను తగ్గించడం కాదు కదా, వాటి సంఖ్య పెరుగుతోందని చెప్పడానికి సిగ్గుపడడం లేదని మంత్రి తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై అంతర్జాతీయ సమావేశాల్లో చర్చలు జరిగే సమయంలో తన ముఖాన్ని దాచుకోవాల్సి వస్తోందని మంత్రి చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఓ సప్లిమెంటరీ ప్రశ్నకు బదులిస్తూ.. భారత్‌లో మనుషుల ప్రవర్తన మారాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజం చాలా మారాలని, రోడ్డు రూల్‌ను అందరూ గౌరవించాలన్నారు. కొన్నేళ్ల క్రితం ఫ్యామిలీతో ప్రయాణిస్తున్న సమయంలో తన వాహనానికి యాక్సిడెంట్ జరిగిందని, అప్పుడు చాలా రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు గుర్తు చేశారు. ప్రమాదాలపై వ్యక్తిగత అనుభవం ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. రోడ్లపై ట్రక్కుల పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు మంత్రి చెప్పారు. చాలా వరకు ట్రక్కులు లేన్ డిసిప్లేన్ పాటించడం లేదన్నారు. బస్సు బాడీని తయారు చేసే విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాలన్నారు. బస్సు విండో దగ్గర సుత్తె ఉండాలని, ఎందుకంటే ప్రమాదం జరిగిన సమయంలో దాని ద్వారా తప్పించుకోవచ్చు అన్నారు. దేశంలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాల వల్ల సుమారు 1.78 లక్షల మంది మరణిస్తున్నట్లు చెప్పారు. దీంట్లో 60 శాతం మంది బాధితులు 18 నుంచి 34 ఏళ్ల మధ్య వయసు వారున్నారు. ప్రమాదాల జాబితాలో ఉత్తరప్రదేశ్ లీడింగ్‌లో ఉన్నది. నగరాల్లో ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నది. యూపీలో రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి ఏడాది 23 వేల మంది మరణిస్తున్నారు. అంటే సుమారు 13.7 శాతం అన్నమాట. ఆ తర్వాత జాబితాలో తమిళనాడు ఉన్నది. తమిళనాడులో ప్రతి ఏడాది 18 వేల మంది మరణిస్తున్నారు. ఇది మొత్తంలో 10.6 శాతం. మహారాష్ట్రలో ప్రతి ఏడాది 15 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఆ తర్వాత మధ్యప్రదేశ్(13వేలు) ఉన్నది. ఢిల్లీ సిటీలో ప్రతి ఏడాది 1400 మంది మరణిస్తున్నారు. బెంగుళూరు రెండో స్థానంలో ఉన్నది ఆ సిటీలో 915 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జైపూర్‌లో ఏడాదికి 850 మంది మరణిస్తున్నారు. అత్యంత సులువుగా డ్రైవింగ్ లైసెన్సు దొరికే దేశం మనదే అని చెప్పడానికి సంకోచించడం లేదన్నారు. కానీ జనాల్లో డ్రైవింగ్ సెన్స్ లేదన్నారు.

# ప్రార్థనా స్థలాల సర్వేలపై స్టే
# ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటుపై విచారణ

### పూర్తయ్యే వరకు కొత్తగా వ్యాజ్యాలు స్వీకరించొద్దు
### దేశవ్యాప్తంగా అన్ని కోర్టులకూ సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ : మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధనలను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 ప్రకారం, మతపరమైన ప్రార్థనా స్థలాలు 1947 ఆగస్టు 15న ఏ విధంగా ఉన్నాయో, అదే పరిస్థితిని కొనసాగించాలి. వాటి మతపరమైన స్వభావాన్ని మార్చకూడదు. ఈ చట్టాన్ని హిందూ సంస్థలు, మరికొందరు పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ చట్టం హిందువులు, జైనులు, బౌద్ధులు, సిక్కుల హక్కులను ఉల్లంఘిస్తున్నదని ఆరోపించారు.



## మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రతి మహిళకు రూ.2,100 : కేజ్రీవాల్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ దూకుడు పెంచింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక హామీలు ప్రకటిస్తోంది. ఇప్పటికే ఆటో డ్రైవర్లకు ఐదు కీలక హామీలు ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ గుడ్ న్యూస్ చెప్పింది. వచ్చే ఎన్నికల్లో ఆప్‌ను గెలిపిస్తే 18 ఏళ్లు పైబడిన ప్రతి మహిళకూ నెలకు రూ. 2,100 అందజేస్తామని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. గురువారం సీఎం అతిశీతో కలిసి ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'ప్రతి మహిళకు రూ. 1,000 ఇస్తామని గతంలో హామీ ఇచ్చాము. అయితే, కొంతమంది మహిళలు నా వద్దకు వచ్చి ద్రవ్యోల్బణం కారణంగా రూ. 1,000 సరిపోవడం లేదని చెప్పారు. అందుకే వారి అభ్యర్థన మేరకు 18 ఏళ్లు పైబడిన మహిళలందరికీ నెలకు రూ. 2,100 ఇస్తాం' అని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలోకే ఈ మొత్తాన్ని జమ చేయనున్నట్లు వెల్లడించారు.



## తిరుచ్చి రంగనాథర్ ఆలయానికి వజ్రాల కిరీటాన్ని విరాళంగా ఇచ్చిన ముస్లిం కళాకారుడు

'హిందూ- ముస్లిం భాయీభాయీ'.. మనదేశంలో సుపరిచితమైన నానుడి. హిందూ- ముస్లిం సఖ్యతను చాటిచెప్పే నినాదం ఇది. దీన్ని నిజం చేస్తూ.. మతసామరస్యానికి ప్రతీకగా ఓ ముస్లిం కళాకారుడు భక్తిని చాటుకున్నాడు. తమిళనాడులోని తిరుచ్చిలోగల ప్రఖ్యాత శ్రీరంగం రంగనాథర్ ఆలయానికి600 వజ్రాలతో ప్రత్యేకంగా తయారు చేసిన కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. ముస్లిం అయిన జహీర్ హుస్సేన్.. భరతనాట్య కళాకారుడు. తన ప్రదర్శనల ద్వారా వచ్చిన మొత్తాన్ని కొద్దికొద్దిగా సేవ్ చేసి ఈ కిరీటాన్ని తయారు చేయించారు. బుధవారం ఆలయ ప్రధాన అర్చకుడు సుందర్ భట్టర్‌కు ఈ విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జహీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. తనకు ముస్లిం, హిందూ, క్రిస్టియన్ అనే తేడా లేదని తెలిపారు. ఈ కిరీటాన్ని గోపాల్ దాస్ అనే కళాకారుడు రూపొందించినట్లు చెప్పారు. దీన్ని రూపొందించేందుకు దాదాపు ఎనిమిదేళ్లు పట్టినట్లు వెల్లడించారు. 3,169 క్యారెట్ల బరువున్న ఒకే రూబీ రాయితో ఈ కిరీటాన్ని తయారు చేసినట్లు చెప్పారు. ప్రపంచంలోనే ఈ రకమైన మొదటి కిరీటం ఇది అని తెలిపారు.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 12 మంది మావోయిస్టులు మృతి

బస్తర్: ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకర ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. దంతేవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో భద్రతా సిబ్బంది మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు ఎదురుపడిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. ప్రతిగా భద్రతా బలగాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టులు మరణించారు. గురువారం ఉదయం 3 గంటల నుంచి ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని బస్తర్ పోలీసులు వెల్లడించారు. కూంబింగ్‌లో నారాయణపూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగాల్ జిల్లా భద్రతా బలగాలతోపాటు డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి. కాగా, నవంబర్ 30న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. మావోయిస్టులు, పోలీసులకు మధ్య భీకరపోరులో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఇందులో ఒకరు మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు ఏకే 47 తుపాకులతోపాటు మరో ఐదు ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లయ్య ఉన్నారు.

## బృందావన్‌లో ఇస్కాన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం

మథుర: బృందావన్‌లో ఇస్కాన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందని ఉత్తరప్రదేశ్ మంత్రి యోగేంద్ర ఉపాధ్యాయ్ చెప్పారు. భగవద్గీత, సనాతన ధర్మాలను బోధిస్తుందని తెలిపారు. ఇది మన దేశ భవిష్యత్తు అవుతుందన్నారు. ఇస్కాన్ బృందావన్‌లోని గురుకుల్‌లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. వెయ్యేళ్ల క్రితం 10 వేల మంది విద్యార్థులకు విద్య నేర్పిన నలంద విశ్వవిద్యాలయం స్థాయికి ఇస్కాన్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయం చేరుకుంటుందన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీమంత్రి కొప్పుల

**ఎండపల్లి, డిసెంబర్ 12 ( ప్రజా తీర్పు ప్రతినిధి )**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ధర్మపురి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ తన వీరాభిమాని జూలపల్లి మండల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లోక రవిధర్ రెడ్డి కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి , పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ లతోపాటు మండల టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు, కొప్పుల ఈశ్వర్ అభిమానులు పాల్గొన్నారు.

## నేడు బాసరకు మంత్రి సీతక్క రాక.

## బాసర లో పలు అభివృద్ధి కార్యక్రమాల పై కార్యకర్తల తో చర్చ.

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 12)**



నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క నేడు శుక్రవారం బాసర్ కు రానున్నారు. ముందుగా బాసర్ ఆలయం లోని చదువుల తల్లి శ్రీ సరస్వతి మాత ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.అనంతరం ఉదయం పది గంటలకు స్థానిక జి ఎస్ గార్డెన్ లో ఏర్పాటు చేయనున్న నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో సమావేశంలో పాల్గొంటారు.మంత్రి సీతక్కకుమాజీ ఎమ్మెల్యే లు విఠల్ రెడ్డి, నారాయణ రావ్ పటేల్.ఘన స్వాగతం పలకనున్నారు. మాజీ ఎమ్మెలే విఠల్ రెడ్డి. ఆదేశాలతో కార్యకర్తలు అందరు సమయ పాలన పాటించి ఉదయం పది గంటలకు జిఎస్ గార్డెన్ లో హాజరు కావాలని బాసర మండల మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు పెద్ద కొండ్రు సుధాకర్ రెడ్డి, బాసర మాజీ సర్పంచ్ దయాల లక్ష్మణ్ రావు ఒక ప్రకటన లో కోరారు.

## ఇసుక నుండి బయట పడ్డ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి విగ్రహం

**ఎండపల్లి, డిసెంబర్ 12 : ( ప్రజా తీర్పు ప్రతినిధి )**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామం లో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయా నికి ప్రహరి తో పాటు, ద్వారం (గేటు) కోసం పిల్లర్ లు కాంట్రాక్టర్ బుర్ర విజయ్ నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో పిల్లర్ ల నిర్మాణానికి కావాల్సిన ఇసుకను గోదావరి నుండి తీసుకొచ్చారు. ఇసుక వాడక సమయంలో ఇసుకను తవ్వితీస్తుండగా, అందులో నుండి శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి విగ్రహం బయట పడిందని గురువారం విస్తృతంగా ప్రచారం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామ ప్రజలే కాకుండా, పరిసర గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి లక్ష్మీ నరసింహా స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

## రేకుర్తి ఆసుపత్రిని సందర్శించిన అంతర్జాతీయ ప్రతినిధి

**వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 12**

అమెరికాకు చెందిన లయన్స్ అంతర్జాతీయ ప్రతినిధి తాష హెడంరిచ్, గ్లోబల్ గ్రాంట్స్ స్పెషలిస్ట్ లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాలను గురువారం సందర్శించారు . ఈ సందర్భంగా ఆయన లెన్సో మీటర్ పరికరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి ఆసుపత్రి పని విధానాన్ని, శుభ్రతను అభినందించారు. ఆసుపత్రికి లయన్స్ అంతర్జాతీయ సంస్థ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ వేణు మూర్తి, చిదుర సురేష్, బొమ్మ పవన్ కుమార్, ప్రకాష్ హెూళ్ళ, డాక్టర్ మురళీధర్ రావు, కోల అన్నారెడ్డి , ముక్క శరత్ కృష్ణ, శివకంత్, వినోద్, రాజీ రెడ్డి, కోదండరాములు, మొర భద్రేషం ఆసుపత్రి సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.




# గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

### అభ్యర్థులు సమయపాలన పాటించాలి.

### నిమిషం ఆలస్యమైన అనుమతి లేదు.

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**(ప్రజాతీర్పు జిల్ల ప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 12)**




గ్రూప్ -2 పరీక్షల నిర్వహణకు పగడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి సంబధిత అధికారులతో ఆమె గ్రూప్ 2 పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నిర్మల్ పట్టణంలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 8080 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. డిసెంబర్ 15న ఉదయం 10:00 నుండి 12:30, వరకు మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు, అలాగే 16వ తేదీన ఉదయం10:00 గంటల నుండి 12:30 వరకు, మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాలని, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్, స్మార్ట్ వాచీలు వంటి వస్తువులతో రాకూడదని అన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్రాలలో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, టాయిలెట్స్, త్రాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పొరపాట్లకు తావు లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహించేలా అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలపై శిక్షకులు రవికుమార్ పరీక్షల నిర్వహణపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పరీక్షల కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, డిపార్ట్మెంట్ అధికారులు, గోవింద్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, అంబాజీ, రమణ, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సుదర్శన్, సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న జెసిబి యజమాని

### పలువురు నాయకులు హర్షం వ్యక్తం

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 12**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డ్ పేట మండల కేంద్రం చెందిన ఓ జెసిబి యజమాని కెసిఆర్ కాలనీలో ఓ వ్యక్తి మృతి చెందగా అతని మృతదేహాన్ని తన జెసిబి తో ప్రాణం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే ఎల్లారెడ్డిపేట కేసీఆర్ కాలనీకి చెందిన కడు నిరుపేద కడమంచి పాపయ్యఏ పాముల పాపయ్య అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైయ్యాడు. అప్పటినుంచి కెసిఆర్ కాలనీలో చికిత్స పొందుతూ గురువారం రోజు తీవ్రత గురై మృతి చెందాడు. పాముల పాపయ్య ఎల్లారెడ్డిపేట మండలంలో గత కొన్ని నీళ్లుగా పాములను పడుతూకుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన దేహం సహకరించకపోగా ఇటీవల సైకిల్ పై రోడ్డు క్రాస్ చేస్తూ కేసీఆర్ కాలనీకి వెళ్తుండగా ఓ ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి కారుతో అతని బలంగా ఢీకొట్టారు. వెంటనే హుటా హుటిన కరీంనగర్లోని సుమారు 10 లక్షలు ఖర్చు చేసి పాముల పాపయ్య కు ఖరీదైన వైద్యం అందించారు.అప్పటినుంచి చికిత్సపొందుతున్న పాముల పాపయ్య గురువారం తీవ్ర అస్వస్థకు గురైమృత్యువాత పడ్డాడు. కడు నిరుపేద కుటుంబానికి చెందిన పాపయ్య మండల కేంద్రంలోని పాములు కనిపిస్తే సమాచారం అందించడంతో వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పాముల్ని పట్టుకొని ఎంతోకొంత డబ్బుల్ని ఆశిస్తూ కుటుంబాన్ని పోషించాడు. రోడ్డు ప్రమాదంలో గాలి విశ్రాంతి తీసుకున్నట్టు సమయంలో సడన్గా మృతిచెందనంతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎవరి ఇంట్లో అయినా పాములు వస్తే సమాచారం ఇచ్చేది ఎవరికి పాములు పట్టేది ఎవరు అని కోణంలో ప్రజలు తీవ్ర ఆలోచనలో పడ్డారు. పాపయ్య మూర్తి వార్త విన్న గోలి పెల్లి ప్రవీణ్ రెడ్డి వెంటనే చెల్లించిపోయి అతని దగ్గర ఉన్నటువంటి జెసిపి సహాయంతో గిద్ద చెరువు కట్ట వద్ద గోతి తీసి అందులో అతడి దేహాన్ని సమాధి చేశారు. మానవత్వం చాటుకున్న ప్రవీణ్ రెడ్డిని పలువురు రాజకీయ నాయకులు స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు.



## టీయూడబ్ల్యూజే నూతన కమిటీకి అభినందనలు

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 12 )**

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కమిటీకీ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. టియుడబ్ల్యూజే (ఐజేయు ) నూతన అధ్యక్షునిగా ఎన్నికైన గాండ్ల శ్రీనివాస్ , కార్యదర్శిగా ఎన్నికైన కొయ్యడ చంద్రశేఖర్ , కోశాధికారిగా ఎన్నికైన గాజుల వెంకటేష్ , ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన గాండ్ల సంపత్ లకు , నూతన కమిటీ కార్యవర్గ సభ్యులందరికీ కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం రోజున విడుదల చేసిన పత్రికా ప్రకటన ద్వారా శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

**మంత్రి బండి సంజయ్ కు కృతజ్ఞతలు**

తీగల గుట్టపల్లి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

కరీంనగర్ నగరపాలక సంస్థ ఒకటో డివిజన్ తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బోర్ వెల్ వేయించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్కు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు , స్థానిక కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. తీగల గుట్టపల్లి లోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నో సంవత్సరాల సరైన నీటి సౌకర్యం లేక పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఇటీవల కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన మంత్రి బండి సంజయ్ అధికారులతో మాట్లాడి బోర్ మంజూరు చేయించారు. గురువారం నాడు పాఠశాల ఆవరణలో బోర్ వేయించారు.



## డాక్టరేట్ అవార్డు గ్రహీత ఎల్లంపల్లికి సన్మానం.

**కుత్బుల్లాపూర్,డిసెంబర్ 12(ప్రజాతీర్పు)**

ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లంపల్లి నరసింహులు కు "ద అమెరికన్ యూనివర్సిటీ యుఎస్ఎ " డిసెంబర్ 1న ముంబైలోని సోఫియా బాబా ఆడిటోరియంలో నిర్వహించిన కాన్వకేషన్ లో భాగంగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా పీపుల్స్ న్యూస్ తెలుగు దినపత్రిక సిఎండి కే శ్రావణ్ కుమార్ గురువారం పత్రిక ప్రధాన కార్యాలయంలో ఎల్లంపల్లి నరసింహను ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ మిత్రుడు నరసింహులు గత 12 సంవత్సరాలుగా మీడియా రంగంలో అందించిన విశేష సేవలకు గుర్తింపుగా" ద అమెరికన్ యూనివర్సిటీ యు.ఎస్.ఎ " గుర్తించి డాక్టరేట్ పట్టాను అందజేయడం ఎంతో సంతోష మన్నారు. మున్ముందు ఇలాంటి అవార్డులు , ఎన్నో అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టు మిత్రులు పాల్గొన్నారు.

## చిరునవ్వు ఫౌండేషన్ సేవలు అభినందనీయం : బండి రమేష్

**కూకట్పల్లి,డిసెంబర్ 12(ప్రజాతీర్పు)**

ఉన్నంతలోనే పేదలకు సేవ చేయాలనుకోవడం అభినందనీ యమని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు స్థానిక మున్సిపల్ ఉద్యోగి చిరంజీవి ఏర్పాటు చేసిన చిరునవ్వు ఫౌండేషన్ ఆధ్వర్యంలో తనయుడు పుట్టినరోజు సందర్భంగా గురువారం బాలాజీ నగర్ లో మహిళా శానిటేషన్ సిబ్బంది 40 మందికి చీరలు పంపిణీ చేశారు అంతకుముందు చిరునవ్వు ఫౌండేషన్ లోగోను రమేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు కార్యక్రమంలో, గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, సాధు ప్రతాపరెడ్డి , తూము సంతోష్ శివ చౌదరి, రమణ, హరి ప్రసాద్, గోపి,తదితరులు పాల్గొన్నారు..



# జర్నలిజంలో విలువల పెంపుకోసం కృషి చేయాలి

## డబ్ల్యూజేఐలో చేరిన చిగురుమామిడి మండల పాత్రికేయులు

( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్ డిసెంబర్ 12 )

జర్నలిజం వృత్తిలో నానాటికి విలువలు దిగజారి పోతుండడం పట్ల బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. వృత్తి విలువల పెంపుదల కోసం నవతరం పాత్రికేయులు కృషి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన 15 మంది విలేకరులు వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాలో చేరారు. ఈ సందర్భంగా వారికి స్వాగతం పలుకుతూ విలేకరులు కేవలం వార్త సేకరణకే పరిమితం కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో మమేకం కావాలని సూచించారు. జర్నలిజం రంగంలోకి కొత్తగా వస్తున్న వారికి వృత్తి శిక్షణతో పాటు, డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, నేత్ర , రక్త నిర్ధారణ పరీక్షల శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జర్నలిస్టు సంఘాలకు సంఖ్యా బలమే ముఖ్యం కాదని, నిజాయితీతో, నిబద్ధతతో, పనిచేసే జర్నలిస్టులకు డబ్ల్యూజేఐ తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయని చెప్పారు. నూతన సంవత్సరంలో డబ్ల్యూజేఐ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్టు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసమే నిరంతరం పనిచేసే నాయకత్వం వెంట జిల్లాలోని జర్నలిస్టులు అందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా జర్నలిస్టులకు నిరంతరం తాము అండగా ఉంటామని, వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగిస్తామని, వారి కష్ట,సుఖాల్లో భాగస్వాములు అవుతామని తెలిపారు. జర్నలిస్టుల వసుదైక కుటుంబం తమలక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో జిల్లాలోని జర్నలిస్టులందరూ భాగస్వాములు అవుతారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గురువారం చిగురుమామిడి ప్రెస్ క్లబ్ (రిజిస్టర్డ్ నెంబర్ 347/2024) అధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్ ( నవతెలంగాణ), ప్రధాన కార్యదర్శి రాకం కరుణాకర్ ( దిశ) ల ఆధ్వర్యంలో కే బాలయ్య (సాక్షి), పత్తెంరమేష్ (వార్త), మారుపాక రమేష్( ప్రజా సాక్షి ), ఎలగందుల రవీందర్ ( తెలుగు ప్రభ),తాళ్ల నరేష్ ( సిరా న్యూస్ ),గుడికందుల దేవదాస్ (అక్షరం),బోయిన సంపత్ (వాస్తవం ),బొల్లబత్తిని మహేష్ (ప్రజా దర్బార్ ) ముంజ శ్రీకాంత్ ( అక్షర విజేత) తదితరులు డబ్ల్యూజేఐ సభ్యత్వం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జిల్లా నాయకులు టి సత్యనారాయణ దారం జగన్నాథ రెడ్డి ఆడెపు లక్ష్మీనారాయణ డి ఎస్ ప్రసాద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





## సమస్యలపై క్షేత్రస్థాయిలో KLR పర్యటన

### పార్టీలు, కుల, మతాలకు అతీతంగా విగ్రహాల ఏర్పాటు

### మహేశ్వరం చౌరస్తాలో ట్రాఫిక్ ఇబ్బందులు రానివ్వొద్దు

### మెడికల్, నర్సింగ్ కాలేజీలకు 30 ఎకరాల భూసేకరణ!.

మహేశ్వరం నియోజకవర్గం

(ప్రజా తీర్పు పత్రిక రిపోర్టర్ వై యాదగిరి)...

మహేశ్వరం చౌరస్తాలో పార్టీలకు అతీతంగా జాతీయోధ్యమ, సంఘ సంస్కర్తల నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని నియోజకవర్గ బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు.కుల, మతాలకు అతీతంగా మహానీయుల విగ్రహాలను ఏర్పాటు చేసి... భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలని కేఎల్ఆర్... కాంగ్రెస్ సహా విపక్ష నాయకులకు సూచించారు.ఏ వర్గం అసంతృప్తి కాకుండా, వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చౌరస్తా రింగ్ లోపల విగ్రహాలను నిలపాలన్నారు కిచ్చెన్నగారు.మెడికల్, నర్సింగ్ కాలేజీలకు 30ఎకరాలు! మహేశ్వరం పట్టణంలో క్షేత్ర పర్యటన (బుధవారం) చేసి పలు సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలకు మహేశ్వరం మండలంలో 30 ఎకరాల స్థలం సేకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజీ 25 ఎకరాలు, నర్సింగ్ కాలేజీ 5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయటం వల్ల రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునాతన వైద్య సదుపాయాలు కల్పించవచ్చని లక్ష్మారెడ్డి చెప్పారు. వైద్య సేవల కోసం KLR ట్రస్ట్ ఎంత ఖర్చైనా భరిస్తుందని నిర్వాహకులు తెలిపారు.



## కోహెడలో రాజకీయ పార్టీ నేతలతో ఎంపీడీవో సమావేశం

( ప్రజాతీర్పు ప్రతినిధి కోహెడ డిసెంబర్ 12 )

త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో గడ్డం కృష్ణయ్య గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పోలింగ్ బూతుల ఏర్పాటు ఓటర్లకు సంబంధించిన వివరాలను వెల్లడించి అభ్యంతరాలు ఉంటే తెలుపాలని ఎంపీడీవో కృష్ణయ్య రాజకీయ పార్టీల నేతలను కోరారు. మండలంలో మొత్తం 37,644 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 18599, మహిళలు 19044, ట్రాన్స్ జెండర్ ఒకరు ఉన్నారు. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలకు గాను 244 వార్డులు ఉండగా 244 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలి పారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఎంపిఓ ఎం శోభ, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశం, బిఆరెస్ మండల అధ్యక్షుడు పెరుగు నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, సిపిఐ మండల కార్యదర్శి ముంజ గోపి గౌడ్,బిఎస్పీ మండల అధ్యక్షుడు వేల్పుల మహేష్ పార్టీల నాయకులు పిల్లి నర్సయ్య, తిప్పారపు నాగరాజు, పొలవేని కుమారస్వామి,బండారు లక్ష్మణ్, చల్ల సత్తిరెడ్డి, కొమ్ముల రాంచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా పెద్ది వెంకట నారాయణ జన్మదిన వేడుకలు

భీమదేవరపల్లి, డిసెంబర్ 12
( ప్రజాతిర్పు విలేఖరి )

రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్, భీమదేవపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పెద్ది వెంకటనారాయణ 77వ జన్మదిన వేడుకలు హనుమకొండ జిల్లా భీమదేవపల్లి మండలం ముల్కనూరు అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కోల్గురి రాజు, ఆది రవీందర్, మాడుగుల ఎట్రా, మాడుగుల వీరస్వామి, మీసా మహేష్, గజ్జల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 14న జరుగు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా ఎస్పి డా.జి. జానకి షర్మిల

(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 12)



నిర్మల్ జిల్లాలో చాలా కాలంగా కోర్టులో పెండిరగ్‌లో వున్న కేసు పరిష్కారం కోసం జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్, ఆదేశానుసారం నిర్మల్ జిల్లా ఎస్పి డా.జి. జానకి షర్మిల ప్రజలకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 14వ తేదిన అన్ని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిం చబడును. ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హతమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, చెక్‌బౌన్స్‌కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్‌నందు ఇరువర్గాల కక్షీదారులు అంగీకారయోగ్యమైన సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని. ఇరువర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని డబ్బులను వృధా చేసుకోవద్దని, జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారికి సమాచారం ఇచ్చి రాజీ కి అవకాశం కల్పిస్తారని సూచించారు. మరిన్ని వివరాలను కొసం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా ఎస్పి తెలియజేసారు.

## టియూడబ్ల్యూజే (ఐజేయూ)కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులుగా శైలేందర్ రెడ్డి

ఎండపల్లి, డిసెంబర్ 12( ప్రజా తీర్పు ప్రతినిధి )



జగిత్యాల జిల్లా ఉమ్మడి వెల్గటూర్ మండలం లోని రాజారాంపల్లి గ్రామానికి చెందిన ఎలేటి శైలేందర్ రెడ్డి గత 30 ఏళ్లుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో పత్రికా రంగంలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఎలేటి శైలంధర్ రెడ్డి ఓ ప్రముఖ దిన పత్రిక లో ఫోటోగ్రాఫర్ గా విధులు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం జరిగిన కరీంనగర్ జిల్లా ఎన్నికల్లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షులుగా గెలుపొందారు. తమ ప్రాంతవాసి కరీంనగర్ జిల్లా పాత్రికేయ యూనియన్ ఉపాధ్యక్షులుగా శైలేందర్ రెడ్డి గెలుపొందడం పట్ల ఉమ్మడి వెల్గటూర్ మండలం ( వెల్గటూర్,ఎండపల్లి) మండలాల నుండి టియుడబ్ల్యూజే( ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నక్క లక్ష్మణ్ యాదవ్ తో పాటు రెండు మండలాల పాత్రికేయులు హర్షం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టుల మరణాల పలు నివేదికలు

పారిస్: ప్రపంచవ్యాప్తంగా 54 మంది జర్నలిస్టులు తమ విధులను నిర్వహిస్తున్నప్పుడు లేదా వారి వృత్తి కారణంగా 2024లో చంపబడ్డారు. వారిలో మూడవ వంతు ఇజ్రాయిల్ సైన్యం చేత చంపబడ్డారని గురువారం రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ (ఆరెస్ఎఫ్) ప్రచురించిన వార్షిక నివేదిక పేర్కొంది. పత్రికా స్వేచ్ఛ ఎన్.జీ.వో ప్రకారం ఈ సంవత్సరంలో 18 మంది జర్నలిస్టుల మరణాలకు ఇజ్రాయెల్ సాయుధ దళాలు కారణమయ్యాయని తెలిపింది. గాజాలో 16 మంది, లెబనాన్‌లో ఇద్దరు మృతి చెందినట్లు పేర్కొంది. పాలస్తీనా జర్నలిస్టులకు అత్యంత ప్రమాదకరమైన దేశంగా, గత ఐదేళ్లలో(డిసెంబర్ 1 వరకు) ఇతర దేశాల కంటే ఎక్కువ మరణాల సంఖ్య నమోదైందని ఆరెస్ఎఫ్ తన వార్షిక నివేదికలో పేర్కొంది. "జర్నలిస్టులపై ఇజ్రాయెల్ సైన్యం చేసిన యుద్ధ నేరాల"పై ఆ సంస్థ అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ (ఐసిసి)లో నాలుగు ఫిర్యాదులను దాఖలు చేసింది. అక్టోబరు 2023లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గాజాలో మొత్తం 145 మందికి పైగా జర్నలిస్టులు మరణించారని, వారిలో 35 మంది విధుల నిర్వహణలో మరణించారని ఆర్ఎస్ఎఫ్ తెలిపింది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 104 మంది జర్నలిస్టులు మరణించారని, వారిలో సగానికి పైగా గాజాలో ఉన్నారని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐ.ఎఫ్.జె) మంగళవారం ప్రచురించిన ప్రత్యేక నివేదికలో పేర్కొంది. మృతుల లెక్కించడంలో ఉపయోగించే రెండు వేర్వేరు పద్ధతుల కారణంగా ఐ.ఎఫ్.జె, ఆరెస్ఎఫ్ మధ్య గణాంకాలు విభిన్నంగా ఉంటాయి. ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా జర్నలిస్టులకు హాని చేస్తుందనే నివేదికను ఖండించింది. అయితే సైనిక వైమానిక దాడుల్లో కొందరు మరణించారని అంగీకరించింది. ఆరెస్ఎఫ్ గణాంకాల ప్రకారం, డిసెంబర్ 1 నాటికి ప్రపంచవ్యాప్తంగా 550 మంది జర్నలిస్టులు అరెస్టు చేశారు. గత ఏడాది 513 మందిని అరెస్టు చేశారు.




# ఇమ్రాన్ దంపతులపై కొత్త తోషఖానా కేసు...

ఇస్లామాబాద్: కొత్త తోషాఖానా కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీపై కోర్టు అభియోగాలను మోపింది. ఇమ్రాన్ ఖాన్ పై కత్తిగట్టిన పాక్ ప్రభుత్వం ఆయనను శాశ్వతంగా జైలులో ఉంచేందుకు ఒక కేసు తరువాత మరో కేసు బనాయిస్తున్నది. ఇమ్రాన్ దంపతులపై దాఖలైన తోషఖానా కేసుల పరంపరలో ఇది మూడవది. మొత్తంగా బనాయించిన కేసుల్లో ఏడవది. గత సంవత్సరం మే9న నిరసనల సందర్భంగా ఆర్మీ జనరల్ హెడ్ క్వార్టర్స్‌పై దాడికి సంబంధించి పిటిఐ వ్యవస్థాపకుడు, ఇతర పార్టీ నాయకులపై అభియోగాలు మోపిన వారం రోజులకే ఈ కొత్త తోషఖానా కేసును తెరపైకి తెచ్చారు. గత ఏడాది ఆగస్టు5న ఇమ్రాన్‌ను అరెస్టు చేసినప్పటి నుండి ఆయనను జైలు నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రానీయరాదన్న దాంతో వరుస కేసులు పెట్టారు. ఆర్మీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో ఇస్లామాబాద్ హైకోర్టు బెయిలు మంజూరు చేసినప్పటికీ ఇతర కేసుల్లో శిక్ష పడి అడియాలా జైలులోనే ఆయన ఉండాల్సి వచ్చింది. ఖరీదైన ఆభరణాలను అతి తక్కువ రేటుకు కొనుగోలు చేయడం ద్వారా అవినీతికి పాల్పడ్డారని ఇమ్రాన్‌పై మోపిన తాజా అభియోగం. ఈ కేసులో విచారణను ఇమ్రాన్ ఉంటున్న అడియాల జైలులోనే ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి షారూఖ్ అర్జుమండ్ గురువారం నిర్వహించారు. ఈ కేసులో వాదనలు వినిపించేందుకు ప్రస్తుతం బెయిలుపై ఉన్న ఇమ్రాన్ భార్య బుష్రా బీబీ తన న్యాయవాదితో కలసి హాజరయ్యారు. ప్రభుత్వం మోపిన తాజా అభియోగాలను ఇమ్రాన్, బుష్రా ఇరువురూ తోసిపుచ్చారు. దీనిపై వాంగ్మూలాలను నమోదు చేసేందుకు ఈ నెల 18న కోర్టుకు రావాల్సిందిగా సాక్షులకు కోర్టు సమన్లు జారీ చేసింది. ఇంతకుముందు 2023 మే10న మొదటి తోషఖానా కేసు ఆయనపై నమోదయింది. రెండవ తోషఖానా కేసు జనవరిలో నమోదయింది. ఫిబ్రవరిలో 19 కోట్ల పౌండ్ల అవినీతికి సంబంధించి మరో కేసు నమోదయింది. ఇటీవల సైనిక హెడ్ క్వార్టర్‌పై దాడి కేసు బనాయించారు. ఇమ్రాన్‌పై ఇంతకుముందు నమోదయిన రెండు తోషఖానా కేసులూ సస్పెండయ్యాయి. . కొత్త తోష్ఖానా కేసు కూడా అంతిమ దశకు చేరుకుంది. ఇమ్రాన్ దంపతులిరువురూ అకౌంటబులిటీ కోర్టు ఎదుట ఈ వారం తమ వాదనలు వినిపించనున్నారు. ఇమ్రాన్ తరపు న్యాయవాది గత నెలలో విచారణ సందర్భంగా ఈ ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. తోషఖానా పాలసీకి అనుగుణంగానే కానుకలను స్వీకరించారని అన్నారు. జులై 13న ఇద్దత్ కేసులో నిర్దోషులుగా వీరు బయటపడిన మరుసటి రోజే కొత్త తోషఖానా కేసు కింద వారిని తిరిగి జైలులో పెట్టారు





# పడకేసిన పారిశ్రామికోత్పత్తి

## అక్టోబర్‌లో 3.5 శాతానికి పరిమితమైన వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. గనులు, విద్యుత్, తయారీ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో అక్టోబర్ నెలలో పారిశ్రామిక వృద్ధి 3.5 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 11.9 శాతంతో పోలిస్తే భారీగా తగ్గినట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. దేశవ్యాప్తంగా గనుల్లో ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో మొత్తం పారిశ్రామిక ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపింది. క్రితం ఏడాది ఇదే నెలలో 13.1 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న గనుల రంగం అక్టోబర్ నెలకుగాను 0.9 శాతానికి పరిమితమైంది. అలాగే తయారీ రంగం కూడా 10.6 శాతం నుంచి 4.1 శాతానికి పరిమితమైంది. దీంతోపాటు విద్యుత్ ఉత్పత్తి కూడా 20.4 శాతం నుంచి 2 శాతానికి పడిపోయింది. 2023 అక్టోబర్ నెలలో 21.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న క్యాపిటల్ గూడ్స్ రంగం ఈసారికిగాను 3.1 శాతానికి పరిమితమైంది. కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్ రంగ వృద్ధి 2.7 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇది 9.3 శాతంగా నమోదైంది. కానీ, వినియోగదారుల మన్నికైన వస్తువుల ఉత్పత్తి విభాగం 5.9 శాతం వృద్ధిని కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-అక్టోబర్ మధ్యకాలంలో పారిశ్రామిక వృద్ధి 4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇది 7 శాతంగా ఉన్నది.

**శాంతించిన ధరల సూచీ**

గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ధరల సూచీ ఎట్టకేలకు శాంతించింది. నవంబర్ నెలలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం 5.48 శాతంగా నమోదైంది. అక్టోబర్ నెలలో నమోదైన 6.21 శాతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టింది. ఆహార పదార్థాలు తగ్గుముఖం పట్టడం, ముఖ్యంగా కూరగాయలు చౌక కావడం వల్లనే రిటైల్ ధరల సూచీ తగ్గుముఖం పట్టిందని కేంద్రం తాజాగా వెల్లడించింది. ఆహార పదార్థాల ధరల సూచీ 9.04 శాతానికి తగ్గింది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 8.70 శాతంతో పోలిస్తే పెరగగా, నమోదైన 10.87 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది.

# పతనమైన ఎఫ్ఎంసీజీ.. ఐటీ షైనింగ్..

## అయినా నష్టాల్లోనే ఇండెక్స్ సూచీలు..!

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 236.18 పాయింట్లు (0.29 శాతం) నష్టంతో 81,289.96 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 81,211.64 పాయింట్ల అత్యంత కనిష్ట స్థాయి నుంచి 81,680.97 పాయింట్ల గరిష్టం మధ్య తచ్చాడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ పతనాలతోనే ముగిశాయి. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 93.10 పాయింట్లు (0.38 శాతం) నష్టంతో 24,548.70 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 24,675.25 పాయింట్ల నుంచి 24,527.95 పాయింట్ల మధ్య తచ్చాడింది. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ -100 0.46 శాతం, నిఫ్టీ స్మాల్ క్యాప్-100 0.9 శాతం నష్టపోయాయి. ఎన్ఎస్ఈ-50లో 35 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఎన్టీపీసీ, హిందూస్థాన్ యూనీ లివర్, కోల్ ఇండియా, హీరో మోటో కార్ప్, బీపీసీఎల్ తదితర స్టాక్స్ 2.63 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు అదానీ ఎంటర్ ప్రైజెస్, భారతీ ఎయిర్ టెల్, ఇండస్ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ స్టాక్స్ 1.90 శాతం వరకూ లాభ పడ్డాయి. నిఫ్టీ ఐటీ, నిఫ్టీ మెటల్ ఇండెక్సులు 0.77 శాతం వరకూ లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ 1.09 శాతం నష్టపోగా, వాటిలో హిందూస్థాన్ యూనీ లివర్, గోద్రేజ్ ప్రాపర్టీస్, కోల్గేట్ పాల్మోలివ్ స్టాక్స్ పతనం అయ్యాయి. ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ పై రూపాయి మారకం విలువ 84.87 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 73.68 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నది. మరోవైపు, ఔన్స్ బంగారం 2747 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. అంతకు ముందు మధ్యాహ్నం మూడు గంటల సమయానికి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 297.52 పాయింట్లు (0.36శాతం) నష్టపోయి 81,228.62 పాయింట్ల వద్ద స్థిర పడింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 110.70 పాయింట్లు (0.45 శాతం) పాయింట్ల పతనంతో 24,531.10 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈ-30లో సగానికి పైగా స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. ఎన్టీపీసీ 2.61 శాతం, హిందూస్థాన్ యూనీ లివర్, లార్సెన్ అండ్ టర్బో, టాటా మోటార్స్, మారుతి సుజుకి ఇండియా తదితర స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. మరోవైపు అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 2.21 శాతం, ఇండస్ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ లాభ పడ్డాయి. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ-50లో సుమారు 34 స్టాక్స్ నష్టాల్లోనే సాగాయి. ఎన్టీపీసీ, హిందూస్థాన్ యూనీ లివర్ 2.41 శాతం చొప్పున, హీరో మోటో కార్ప్, టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, లార్సెన్ అండ్ టర్బో స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, మెటల్ ఇండెక్సులు మినహా అన్ని స్టాక్స్ నష్టాలతోనే సరిపెట్టుకున్నాయి. ఐటీ ఇండెక్స్ 1.05 శాతం, మెటల్ ఇండెక్స్ 0.36 శాతం లాభ పడ్డాయి. మీడియా ఇండెక్స్ గరిష్టంగా 1.84 శాతం, ఎఫ్ఎంసీజీ 0.95, ఆటో 0.80, పీఎస్‌యూ బ్యాంకు 0.69 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.62 శాతం నష్టాలతో ముగిశాయి. గురువారం సాయంత్రం వెలువడే నవంబర్ రిటైల్ ద్రవ్యోల్బణంపైనే ఇన్వెస్టర్ల దృష్టి కేంద్రీకరించారు. గురువారం ఉదయం నుంచి స్టాక్ మార్కెట్ల ఇండెక్సులు ఫ్లాట్‌గా ట్రేడింగ్ అయ్యాయి. తర్వాత అంతర్జాతీయంగా వచ్చిన మిశ్రమ సంకేతాలకు అనుగుణంగా లాభాల్లోకి మళ్లాయి.



# ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపీ

## 84.88 వద్దకు పతనం

## మరో 5 పైసలు క్షీణించిన విలువ



ముంబై : డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ అంతకంతకూ పడిపోతూనే ఉన్నది. గురువారం మరో 5 పైసలు దిగజారి ఫారెక్స్ మార్కెట్‌లో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 84.88 వద్దకు క్షీణించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో పెరుగుదల, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలు, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు.. రూపీని ఒత్తిడికి గురిచేశాయి. ఈ క్రమంలోనే విదేశీ బ్యాంకులు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు భారీగా డిమాండ్ కనిపించింది. నిజానికి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్ట్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచి కరెన్సీ మార్కెట్‌లో డాలర్ పరుగులు మొదలయ్యాయి. ఇదే సమయంలో ఇతర దేశాల కరెన్సీల పతనం కూడా ఆరంభమైంది. ముఖ్యంగా ఆసియా దేశాల్లోని అన్ని కరెన్సీల విలువ క్రమేణా పడిపోతున్నదని ఫారెక్స్ ట్రేడర్లు గుర్తుచేస్తున్నారు. బ్రిక్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా) సభ్య దేశాలపై 100 శాతం సుంకాల పెంపు ఉంటుందని ట్రంప్ హెచ్చరించడమే కారణం అంటున్నారు.

**మూడు రోజుల్లో 27 పైసలు..**

గడిచిన 4 రోజుల్లో 3 రోజులూ రూపీ నష్టాలకే పరిమితమైంది. మిగతా ఆ ఒక్కరోజు ఎక్కడిదక్కడే ఉన్నది. ఇక ఈ మూడు రోజుల ట్రేడింగ్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 27 పైసలు కోల్పోవడం గమనార్హం. సోమవారం ఒక్కరోజే 20 పైసలు క్షీణించగా, బుధ, గురువారాల్లో మరో 7 పైసలు పతనమైంది. భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. మరోవైపు కరిగిపోతున్న దేశంలోని ఫారెక్స్ రిజర్వులు సైతం పరిస్థితుల్ని మరింతగా దిగజార్చుతున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 28న 704.885 బిలియన్ డాలర్లతో ఆల్‌టైమ్ హైలో ఉన్న ఫారెక్స్ రిజర్వులు.. గత నెల 22న 656.582 బిలియన్ డాలర్లకు క్షీణించాయి. దాదాపు రెండు నెలల్లో 48.30 బిలియన్ డాలర్లు హరించుకుపోయాయి.

**ఇట్లయితే ఎదురు దెబ్బే**

జీడీపీ వృద్ధిరేటు పతనం.. రూపాయి మారకం విలువ క్షీణత.. పెట్టుబడుల ఉపసంహరణలు.. దేశంలో ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నాయి. రూపాయి నష్టాలు.. దేశీయ దిగుమతుల్ని భారం చేస్తుండగా, ద్రవ్యోల్బణాన్ని కూడా ఎగదోస్తున్నది. ఇప్పటికే ఆర్బీఐ వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచుతున్నది. ఇప్పుడు రూపీ తీరు.. ఇకపైనా వడ్డీరేట్ల కోతలకు వీల్లేకుండా చేస్తున్నది. ఇదే జరిగితే ఆయా రంగాల్లో వృద్ధి క్షీణించినట్లే.



# ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భేష్..

## కేంద్రానికి రూ.62వేల కోట్ల డివిడెండ్

## మొండి బాకీలు 3.12 శాతానికి తగ్గుదల

## పెరిగిన నికర లాభాలు

## ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు మొండి బాకీల నియంత్రణలో మెరుగ్గా పని చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల స్థూల నిరర్థక ఆస్తులు 3.12 శాతానికి దిగివచ్చాయని పేర్కొంది. 2018 మార్చి నాటికి జిఎన్‌పిఎ ఏకంగా 14.98 శాతంగా ఉందని వెల్లడించింది. ఎన్‌పిఎల గుర్తింపు, రీక్యాపిటలైజేషన్, రిజల్యూషన్, సంస్కరణలు తదితర కీలకమైన నాలుగు ప్రభుత్వ చర్యల వల్ల ఎన్‌పిఎలు తగ్గాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఎన్‌పిఎల పరిష్కారానికి 2015 నుంచి చేపట్టిన సంస్కరణలు బ్యాంక్‌ల పారుబకాయిల తగ్గుదలకు దోహదం చేశాయని పేర్కొంది. మరోవైపు బ్యాంక్‌ల మూలధన నిష్పత్తి 393 బేసిస్ పాయింట్లు పెరిగి 15.43 శాతానికి పెరిగింది. ఇది 2015 మార్చి నాటికి 11.45 శాతంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పిఎస్‌బిలు రూ.1.41 లక్షల కోట్ల నికర లాభాలు సాధించాయి. ఇంతక్రితం 2022-23లో రూ.1.05 లక్షల కోట్ల లాభాలను నమోదు చేశాయి. 2024-25 ప్రథమార్థంలో రూ.0.86 లక్షల కోట్ల నికర లాభాలు ప్రకటించాయి. గడిచిన మూడు సంవత్సరాల్లో పిఎస్‌బిలు రూ.61,964 కోట్ల డివిడెండ్‌ను అందించాయి."దేశంలోని ప్రతీ మూలకు ఆర్థిక సాధికారతను చేర్చడానికి పిఎస్‌బిలు తమ దృష్టిని కొనసాగిస్తున్నాయి. వాటి మూలధన సామర్థ్యం మెరుగుపడింది. మొండి బాకీలు తగ్గడంతో.. ఆస్తులు మెరుగుపడుతున్నాయి. ప్రభుత్వం పైనా ఆధారపడకుండా మార్కెట్ల నుంచి మూలధనాన్ని సమకూర్చుకుంటున్నాయి." అని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశంలో 54 కోట్ల జన్ ధన్ యోజన ఖాతాలు తెరువబడ్డాయని.. అదే విధంగా 52 కోట్ల సెక్యూరిటీ రహిత రుణాలను జారీ చేశామన్నారు. పిఎం ముద్ర, స్టాండ్ అప్ ఇండియా, పిఎం స్వనిధి, పిఎం విశ్వకర్మ పథకాల్లో అధిక రుణాలు జారీ చేశామన్నారు. దేశంలోని వాణిజ్య బ్యాంక్‌ల్లో 2014 నాటికి రూ.61 లక్షల కోట్లుగా ఉన్న రుణాల జారీ.. 2024 మార్చి ముగింపు నాటికి రూ.175 లక్షల కోట్లకు చేరింది. 2014 నాటికి దేశంలో 1,17,990 బ్యాంక్ శాఖలు ఉండగా.. 2024 సెప్టెంబర్ నాటికి 1,60,501 శాఖలకు పెరిగాయి. ఇందులో 1,00,686 శాఖలు గ్రామీణ, చిన్న పట్టణాల్లో ఉన్నాయి.



# రిటైల్ ద్రవ్యోల్బణంలో కాసింత రిలీఫ్..

## ఆహార ఉత్పత్తుల ధరల తగ్గుదల ఎఫెక్ట్..!

అక్టోబర్ నెలతో పోలిస్తే నవంబర్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం కాస్త రిలీఫ్ ఇచ్చింది. అక్టోబర్‌లో 6.21 శాతంగా ఉన్న చిల్లర ద్రవ్యోల్బణం.. నవంబర్ నెలలో 5.48 శాతానికి దిగి వచ్చింది. ఆహార వస్తువులు, ప్రధానంగా కూరగాయల ధరలు తగ్గడం వల్లే నవంబర్ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గిందని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) పేర్కొంది. అక్టోబర్ నెలలో ఉన్న 10.87 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం.. నవంబర్‌లో 9.04 శాతానికి దిగి వచ్చింది. గతేడాది నవంబర్ నెలలో 8.70 శాతంగా ఆహార ద్రవ్యోల్బణం నమోదైంది. కూరగాయలు, పప్పులు- పప్పు అనుబంధ ఉత్పత్తులు, చక్కెర, ఫలాలు, కోడిగుడ్లు, పాలు-పాల ఉత్పత్తులు, మసాలా దినుసులు, కమ్యూనికేషన్స్, రవాణా, పర్సనల్ కేర్ వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని ఎన్ఎస్ఓ తెలిపింది. గత జూలై-ఆగస్టుల్లో 3.6 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం.. సెప్టెంబర్ నెలలో 5.5, అక్టోబర్ కల్లా 6.2 శాతానికి చేరుకున్నది. గతేడాది సెప్టెంబర్ ద్రవ్యోల్బణం కంటే 2024 అక్టోబర్ ద్రవ్యోల్బణం చాలా ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.8 నుంచి 4.5 శాతానికి తగ్గుతుందని గత వారం ఆర్బీఐ అంచనా వేసింది. అయితే డిసెంబర్ త్రైమాసికంలో ఆహార వస్తువుల ధరలు పెరగకుండా ఉండాలంటే ఆహార వస్తువులపై ధరల ఒత్తిళ్లను నియంత్రించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎలన్ మస్క్ సంపదకు ట్రంప్ కార్డ్

## రెండేళ్లలోనే రెట్టింపు వృద్ధి

వాషింగ్టన్ : టెస్లా అధినేత ఎలన్ మస్క్ సంపద ఆయన స్పెస్ ఎక్స్ కంపెనీ రాకెట్ల కంటే వేగంగా దూసుకుపోతోంది. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలుపొందిన తర్వాత హద్దులు లేకుండా ఎగిసింది. గడిచిన రెండేళ్లలోనే రెట్టింపు అయ్యింది. వ్యక్తిగత సంపద పరంగా మస్క్ ఏకంగా 400 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.33 లక్షల కోట్లు. తన స్పేస్‌ఎక్స్‌లోని అంతర్గత వాటా విక్రయంతో మస్క్ సంపద దాదాపు 50 బిలియన్ డాలర్లు పెరిగింది. దీంతో ఆయన మొత్తం నికర విలువ 439.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రపంచంలో ఇప్పటి వరకు ఎవరూ కూడా 400 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిన దాఖలాలు లేవు. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగవుకు పడిపోయింది. కాగా.. ఇటీవలే జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు మస్క్ మద్దతునివ్వడంతో ఆ తర్వాత టెస్లా షేర్లు ఏకంగా 65 శాతం పెరగడం విశేషం.



# నిన్నటి తరాన్ని ఫాలో అయిపోదాం..

## పిల్లలను ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహిద్దాం..



ఆ రోజుల్లో పిల్లల ఆటలన్నీ ఆరుబయటే! 2000 సంవత్సరం వరకు పిల్లల జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండేది. రోజంతా మైదానాల్లో గడిపేవారు. నేటి తరం పిల్లలకు స్మార్ట్‌ఫోనే గ్రౌండ్‌గా మారిపోయింది. వీడియోగేమ్స్ ఆటవిడుపుగా మారాయి. అయితే, ఆరుబయట ఆడుకునే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధన తేల్చింది. ఈ ఆటలు వారిలో శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక నైపుణ్యాలనూ మెరుగుపరుస్తాయని వెల్లడించింది. నాటి తరానికి తెర అంటే.. టీవీ మాత్రమే! సినిమా అంటే.. ఆదివారమే! కానీ, ఇప్పటి పిల్లలు రోజంతా స్క్రీన్‌లోనే గడిపేస్తున్నారు. ఆటలేకాదు, పాఠాలు కూడా స్క్రీన్‌కు అంకితమై వింటున్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్.. ఇలా స్క్రీన్ ఉచ్చులో చిక్కుకొని అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. దేశంలో దాదాపు 61 శాతం మంది తల్లిదండ్రులు, తమ పిల్లల స్క్రీన్‌టైమ్ గురించి ఆందోళన చెందుతున్నారని పలు పరిశోధనల్లో తేలింది. స్మార్ట్ దునియాలో చక్కర్లు కొడుతున్న బాల్యం.. పిల్లల భాషాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతున్నదనీ, వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నదని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. అందుకే, పిల్లల స్క్రీన్‌టైమ్ తగ్గించాలనీ, వారిని ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలనీ సూచిస్తున్నారు.

**పుస్తకాలే నేస్తాలు..**

నైంటీస్ కిడ్స్ దాచుకున్న స్లామ్‌బుక్స్‌ను ఒక్కసారి తిరగేయండి. చాలా పేజీల్లో హాబీస్ దగ్గర.. 'రీడింగ్ బుక్స్' అనే కనిపిస్తుంది. పుస్తకాలే నేస్తాలుగా గడిచిన బాల్యం వాళ్లది. చందమామ కథలు చదువుతూ.. నిద్రలోకి జారుకున్న తరం వాళ్లది. మరిప్పుడో.. స్కూల్ బుక్స్, హోమ్ వర్క్ తప్ప, వేరే పుస్తకమే తెలియకుండా రోజులు గడిపేస్తున్నారు. కాబట్టి.. మీ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచండి. ప్రతిరోజూ పడుకునే ముందు.. వారికి ఒక మంచి పుస్తకం ఇచ్చి చదవమనండి. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. భాషా నైపుణ్యాలూ మెరుగుపడుతాయి.

**ప్రకృతి ప్రేమికులు..**

నాటికాలం పిల్లలు.. ప్రకృతి ప్రేమికులు. చుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూసే ఎక్కువగా నేర్చుకున్నారు. నేటితరానికి ఇల్లు, స్కూలూ తప్ప.. వేరే ప్రాంతం పెద్దగా తెలియదు. అయితే.. ప్రకృతితో మమేకమైతేనే.. పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. సమస్య–పరిష్కార సామర్థ్యాలు మెరుగుపడతాయన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. అందుకే.. ప్రకృతిలో ఉన్న వింతలను, సహజత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వైరస్‌లు, బ్యాక్టీరియాలు అంటూ భయపెట్టకుండా.. పిల్లల్ని స్వేచ్ఛగా మట్టిలో ఆడుకోనివ్వాలి. నీళ్లలో గెంతనివ్వాలి. ప్రకృతిని ప్రేమించేలా.. వారిని ప్రోత్సహించడం చాలా అవసరం.

**బంధాలతో అనుబంధం**

90వ దశకంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఏ పండుగొచ్చినా ఇళ్లన్నీ జనాలతో అనుబంధాల కలబోతలా కళకళలాడేవి. నలుగురు కలిసి ఒక ఇంట్లో ఉండటమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో.. ఇప్పటితరం కుటుంబంతో కన్నా సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువగా గడుపుతున్నది. ఫలితం.. మనిషికి ఉండాల్సిన సహజ భావోద్వేగాలు కూడా మృగ్యమైపోతున్నాయి. ఈ పోకడ.. వారి భవిష్యత్తులో మరిన్ని విపత్కర పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి, పిల్లల మధ్య ప్రేమానురాగాలు పెరిగేలా చూడండి. రోజుకు ఒకపూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా ప్లాన్ చేసుకోండి. అన్నదమ్ముల పిల్లలను తరచూ కలుసుకునే పరిస్థితులు కల్పించండి. తద్వారా వారికి బంధాల విలువ తెలిసొస్తుంది.








# ప్రైమ్‌కి పిన్ పెట్టుకున్నారా?




రోజులో కాస్త ఫ్రీ టైమ్ దొరికినా, వీకెండ్ వచ్చినా.. ఓటీటీకి అంకితం అవుతున్నాం. ఈ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో అమెజాన్ ప్రైమ్ ముందువరుసలో ఉంటున్నది. మీ ప్రైమ్ ఖాతా ఎంతవరకు భద్రంగా ఉందన్నది ప్రధానం. ఇంట్లో పిల్లలు ఉంటే.. ఫోన్ అందుకొని ప్రైమ్‌లోకి చొరబడటం కామన్! రెంట్ పేరుతో కనిపించే సినిమాలనూ కొనేస్తున్నారు!! ఇలా అనవసరమైన కంటెంట్‌ను చూడకుండా నియంత్రించడానికి పిన్ సెట్ చేయడం అవసరం. మీరు ఆండ్రాయిడ్ ఫోన్‌లో అమెజాన్ ప్రైమ్ వాడుతున్నట్లయితే సెట్టింగ్స్‌లోకి వెళ్లి పిన్ సెట్ చేసుకోవచ్చు. ఇందుకోసం యాప్ ఓపెన్ చేసి మీ ప్రొఫైల్ పిక్చర్ క్లిక్ చేయండి. అక్కడ 'సెట్టింగ్స్' ట్యాప్ చేయండి. అక్కడ 'పేరెంటల్ కంట్రోల్స్' ఆప్షన్ కనిపిస్తుంది. అందులోకి వెళ్తే.. వ్యూయింగ్ రిస్ట్రిక్షన్స్, పర్చేస్ రిస్ట్రిక్షన్స్, చేంజ్ ప్రైమ్ వీడియో పిన్ లాంటి ఆప్షన్స్ సెలెక్ట్ చేయడం ద్వారా మీ ప్రైమ్ ఖాతాను సురక్షితంగా వాడుకోవచ్చు. ఇది మీ ఫ్యామిలీకి పేరెంటల్ కంట్రోల్‌లా ఉపయోగపడుతుంది. ఈ సెట్టింగ్స్ మార్చడం వల్ల పిల్లలు అనవసరమైన కంటెంట్ చూడకుండా నియంత్రించవచ్చు!

## సూర్యోదయానికి కంటే ముందే నిద్రలేస్తే!

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది రాత్రి లేటుగా నిద్రపోవడం, ఉదయం లేటుగానే నిద్రలేవడం జరుగుతుంది. దీనివల్ల ఎన్నో అనారోగ్య ప్రయోజనాలున్నా యని వైద్యులు సూచిస్తున్నారు. సమయానికి తినడం, నిద్రపోవడం వంటి క్రమశిక్షణతో కూడిన జీవితానికి చాలామంది ఇప్పుడు దూరమవుతున్నారనడంలో ఆశ్చర్యం లేదు. సూర్యోదయానికి ముందు ఒక గంట నిద్ర లేవడం వల్ల ఆరోజు చేయాల్సిన పనులను త్వరగా చేసుకోవడంతోపాటు, ఆరోగ్య ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి అవేంటో తెలుసుకుందామా..! సూర్యోదయానికి ఒక గంట ముందు నిద్రలేచి.. కళ్లు మూసుకుని, కాసేపు నిటారుగా కూర్చుంటే.. ప్రేగు కదలి కలు జరిగి శరీరంలోని వ్యర్థాలు తొలగిపోతాయి అని వైద్యులు చెబుతు న్నారు. శరీరంలో వ్యర్థాలు తొలగి పోవడం వల్ల ఆరోగ్యానికి మంచిది.



# దూకుడు తగ్గించాల్సిందే!

ఈకాలం పిల్లల్లో దూకుడు స్వభావం పెరుగుతున్నది. పెంపకంలో లోపం, తల్లిదండ్రుల గారాబమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. అయితే, వారిని అదుపులో పెట్టడానికి అరవడం, తిట్టడం, కొట్టడం చేస్తే.. మరీ మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. అది వాళ్ల ఎదుగుదల మీదా ప్రభావం చూపుతుంది. కాబట్టి.. పిల్లల్లో దూకుడు స్వభావాన్ని తగ్గించాలంటే, వారిని కాస్త నెమ్మదిగానే దగ్గరికి తీసుకోవాలి. అదెలాగంటే.. ప్రశాంతతే ప్రధానం: కొందరు పిల్లల్లో కోపం, విసుగు, అసహనం ఎక్కువగా ఉంటాయి. అలాంటివారితో ఎలాంటి సందర్భాల్లోనైనా ప్రశాంతంగానే వ్యవహరించాలి. వారు ఏదైనా తప్పుచేస్తే.. అందరిముందూ కోప్పడకుండా ప్రశాంతంగా వారిని దగ్గరికి తీసుకోవాలి. మీ భావోద్వేగాలు నియంత్రణలోనే ఉన్నాయని పిల్లలకు తెలిసేలా వ్యవహరించాలి. అప్పుడే పరిస్థితి తీవ్రతరం కాకుండా ఉంటుంది. భావోద్వేగాలతో బంధం: పిల్లల్లో ప్రతికూల భావోద్వేగాలు ఉన్నప్పుడే.. వారిలో దూకుడు, నిరాశ, కోపం అనేవి పెరుగుతాయి. అలాంటి సమయంలో కొందరు తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. కాబట్టి.. మీ పిల్లలు తీవ్రమైన భావోద్వేగాలకు గురైనప్పుడు వారికి మద్దతుగా నిలవాలి. వాళ్ల ఫీలింగ్స్‌ను అర్థం చేసుకోవాలి. వారి భావాలను నిర్భయంగా పంచుకోవడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించాలి. ఏదైనా విషయంలో వారు కలత చెందినట్లు అనిపిస్తే.. వారు ప్రశాంతంగా మారడానికి తగిన సమయం ఇవ్వాలి. వారిని కాసేపు అలా ఒంటరిగా వదిలేయాలి. స్నేహ హస్తం: పిల్లలతో కఠినంగా ఉండకుండా.. స్నేహితులుగా మెలగండి. వారితో సరదాగా సమయం గడపడం వల్ల పిల్లల మనసులో ఉండే సంకోచాలు దూరమైపోతాయి. స్కూల్ నుంచి రాగానే హోమ్‌వర్క్ చేయమంటూ విసిగించకుండా.. స్కూల్‌లో సమయాన్ని ఎలా గడిపారో తెలుసుకోండి. దాంతో వాళ్లు మీకు మరింత దగ్గరవుతారు. దృష్టిని మళ్లించాల్సిందే: కొన్నిసార్లు పిల్లల దృష్టిని మళ్లించడం కూడా వారిని కూల్ చేస్తుంది. పిల్లలు దూకుడు స్వభావాన్ని మార్చుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటే.. వారికి సపోర్ట్ చేయాలి. ఇవన్నీ కాకుండా, పరిస్థితి మరీ చేయి దాటిపోతున్నట్లు అనిపిస్తే.. చైల్డ్ సైకాలజిస్ట్ లేదా థెరపిస్ట్‌ని కలవడం మంచిది.

# చలికాలం.. చర్మం పైలం!

చలికాలంతోపాటే చర్మ సమస్యలూ మొదలవుతాయి. శీతలగాలులకు ఒంట్లో తేమ తగ్గిపోయి.. దురద, చర్మం పగిలిపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. వేడివేడి నీళ్లతో స్నానం చేయడం కూడా.. సమస్యను పెంచుతుంది. ముఖ్యంగా శీతకాలంలో పొడి చర్మం.. ప్రతిఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది. జీవనశైలిలో కొన్ని మార్పులవల్ల చలికాలంలో పొడి చర్మం సమస్యనుంచి బయటపడొచ్చు. చలికాలంలో చర్మ సంరక్షణకు అందరూ ఆశ్రయించేది.. మాయిశ్చరైజర్లు, క్రీమ్స్‌నే! అయితే, వీటి రక్షణంతా బయటి నుంచే! అదికూడా తాత్కాలికంగానే! పొడిచర్మం సమస్య పూర్తిగా పరిష్కారం కావాలంటే.. చర్మం లోపలి నుంచీ ఆరోగ్యంగా ఉండాలి. ఇందుకోసం ఆహారపు అలవాట్లలో కొన్ని మార్పులు %-% చేర్పులూ చేసుకోవాలి. చర్మం రోజంతా తేమగా ఉండాలంటే.. శరీరానికి తగినంత నీరు అందించాలి. అందుకే, దాహమైనా.. కాకున్నా రోజుకు కనీసం 8 గ్లాసుల మంచినీళ్లు తాగాలి. చలికాలం తీసుకునే ఆహారంలో నెయ్యి, నువ్వుల నూనె ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవి చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేటెడ్‌గా ఉంచుతాయి. స్నానానికి ముందు గోరువెచ్చని నూనెతో శరీరాన్ని మర్దనా చేసుకోవడం వల్ల చర్మానికి కావాల్సిన పోషణ అందుతుంది. రక్త ప్రసరణ పెరిగి.. చర్మం తేమగా ఉంటుంది. ఇందుకోసం బాదం, నువ్వులు, కొబ్బరి నూనెలు ఎంచుకోవడం మంచిది. రెగ్యులర్‌గా ఉపయోగించే సబ్బులను పక్కన పెట్టండి. ఇవి చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తాయి. దాంతో చర్మం పొడిబారుతుంది. కలబంద, పసుపు, వేప లాంటి సహజ పదార్థాలున్న సబ్బులను వాడండి. ముఖ్యంగా సున్నిపిండితో స్నానం చేయడం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే.. నాణ్యమైన నిద్ర చాలా అవసరం. అందుకే, రోజూ కనీసం 8 గంటలు నిద్రపోండి. శీతకాలంలో మామూలు 'టీ'కి బదులుగా.. అల్లం, దాల్చిన చెక్క లాంటి సుగంధ ద్రవ్యాలతో చేసిన 'హెర్బల్ టీ'ని ఎక్కువగా తీసుకోవాలి. ఇవి శరీరంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంతోపాటు, బాడీకి కావాల్సిన వేడిని అందిస్తాయి.





## ఒలింపిక్స్‌లో క్రికెట్.. బ్రిస్బేన్ కమిటీతో ఐసీసీ చైర్మెన్ జే షా భేటీ

బ్రిస్బేన్: ఒలింపిక్స్ క్రీడల్లో మళ్లీ క్రికెట్‌కు చోటు ఇవ్వనున్నారు. 128 ఏళ్ల తర్వాత జెంటిల్మెన్ ఆట మళ్లీ ఒలింపిక్స్‌లో కనిపించనున్నది. 2028లో జరిగే లాస్ ఏంజిల్స్ క్రీడల్లో క్రికెట్ ఆడనున్నారు. అయితే 2032లో బ్రిస్బేన్‌లో జరిగే ఒలింపిక్స్‌లో.. క్రికెట్‌కు అవకాశం కల్పించే అంశంపై ఇవాళ చర్చ జరిగింది. కొత్తగా నియమితుడైన ఐసీసీ చైర్మెన్ జే షా ఆ మీటింగ్‌లో పాల్గొన్నారు. బ్రిస్బేన్ ఒలింపిక్స్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ఆయన మాట్లాడారు. సమ్మర్ క్రీడల్లో ఒలింపిక్స్‌ను జోడించాలా వద్దా అన్న అంశంపై చర్చించారు. లాస్ ఏంజిల్స్ క్రీడలకు ఓకే చెప్పినా.. బ్రిస్బేన్ క్రీడలకు ఇంకా కన్ఫర్మేషన్ దక్కలేదు. అయితే ఇవాళ బ్రిస్బేన్ అధికారులతో జరిగిన చర్చకు సంబంధించిన వీడియోను జే షా తన ట్విట్టర్‌లో అప్‌లోడ్ చేశారు. బ్రిస్బేన్ ఆర్గనైనింగ్ కమిటీ చీఫ్ సిండీ హుక్, క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో నిక్ హక్లే ఆ మీటింగ్‌కు హాజరయ్యారు. శనివారం నుంచి ఆస్ట్రేలియాతో గబ్బా స్టేడియంలో జరిగే మ్యాచ్‌ను జే షా వీక్షించనున్నారు. ఇక ఫిబ్రవరిలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ గురించి కూడా జే షా ప్రకటన చేయాల్సి ఉన్నది. హైబ్రిడ్ మోడల్‌కు సభ్య దేశాలు అంగీకరించినా.. తుది ప్రకటన ఇంకా వెలుబడలేదు.



## గాయత్రి, త్రిసా జోడీ బోణీ

హాంగ్జౌ: ప్రతిష్ఠాత్మక బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత యువ జోడీ గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీ బోణీ కొట్టింది. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్ పోరులో గాయత్రి, త్రిసా ద్వయం 21-19, 21-19తో చెందిన పియర్లీ టాన్, తిన్హా మురళీధరన్ జంట పై అద్భుత విజయం సాధించింది. 46 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో గెలువడం ద్వారా గ్రూపు-ఏలో సెమీఫైనల్ అవకాశాలను కాపాడుకుంది. శుక్రవారం జపాన్ జోడీపై గెలిస్తే గాయత్రి, త్రిసాకు సెమీస్ బెర్తు ఖరారైనట్లే. ఆది నుంచే జోరు కనబరిచిన భారత ద్వయం వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తు చేసి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

# అభిషేక్ అ'ధర'హో

## 20.50 లక్షలతో ముంబై సొంతం



### జనవరిలో ఐఎస్‌పీఎల్ సీజన్-2

ముంబై : ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్(ఐఎస్‌పీఎల్) రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. వచ్చే జనవరి 26 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరిగే టోర్నీ కోసం గురువారం ముంబైలో ప్లేయర్ల వేలం పాట నిర్వహించారు. ఇందులో లుధియానాకు చెందిన అభిషేక్ కుమార్ దాల్హోర్‌ను రికార్డు స్థాయిలో 20.50లక్షలకు ముంబై మాజీ జట్టు సొంతం చేసుకుంది. లీగ్‌కు ఎంపికైన అతిపిన్న వయసు(15 ఏండ్లు) ప్లేయర్‌గా శ్రీనగర్‌కు చెందిన షరిక్ యాసిర్ నిలిచాడు. దేశంలోని 55 నగరాల నుంచి దాదాపు 30లక్షలకు పైగా ప్లేయర్లు దరఖాస్తు చేసుకోగా 350 మందికి వేలంలో అవవకాశం లభించింది. ఇందులో నుంచి 96 మంది ప్లేయర్లను ఆయా ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్ యాజ మాన్యంలో ఫాల్కన్ రైజర్స్ హైదరాబాద్ పోటీపడుతున్నది. లీగ్‌లో హైదరాబాద్ సహా టైగర్స్ ఆఫ్ కోల్‌కతా, మాజీ ముంబై, కేవీఎన్ బెంగళూరు స్ట్రైకర్స్, చెన్నై సింగమ్స్, శ్రీనగర్ కే వీర్ బరిలో ఉన్నాయి.

# సంతోష్ ట్రోఫీకి తెలంగాణ టీమ్



హైదరాబాద్ వేదికగా జరుగనున్న సంతోష్ ట్రోఫీ కోసం తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్(టీఎఫ్ఏ)గురువారం జట్టును ప్రకటించింది. ఈ నెల 14 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు జరిగే టోర్నీ కోసం 22మందితో రాష్ట్ర టీమ్‌ను ఎంపిక చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి 57 ఏండ్ల తర్వాత తొలిసారి హైదరాబాద్ ఆతిథ్యమిస్తున్నది. లీగ్ మ్యాచ్‌లు శ్రీనిధి దక్కన్ ఎరీనాలో, సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు గచ్చిబౌలి స్టేడియం వేదిక కానుంది. తెలంగాణ ఫుట్‌బాల్ టీమ్: ఇషాన్ సర్కార్, ఫయాజ్, రాజా దేబ్‌నాథ్, మినాల్, ఆర్నాల్డ్ సింగ్, క్రిస్, షేక్ ఉమైర్, జబైర్, కేహాన్, అభిషేక్, ఖప్, శ్రీకాంత్, సాయి, సైఫ్, తజమ్ముల్, వికాస్, ఇంతియాజ్, సైఫ్ అన్సారీ, శశాంక్, కిశోర్, రిజ్వి, అమన్.


# జగజ్జేత గుకేశ్



### ఫైనల్ గేమ్‌లో లిరెన్‌పై అద్భుత విజయం

సింగపూర్: భారత చదరంగ చరిత్రలో నూతన అధ్యాయం. 64 గళ్ల గేమ్‌లో దేశ ఖ్యాతిని మరింత ద్విగుణీకృతం చేస్తూ దొమ్మరాజు గుకేశ్ కొత్త చరిత్ర లిఖించాడు. డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను చిత్తు చేస్తూ ప్రతిష్ఠాత్మక చెస్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ విజేతగా నిలిచి అందరినీ ఆశ్చర్య పరిచాడు. గురువారం జరిగిన ఆఖరిదైన 14వ గేమ్‌లో నల్లపావులతో బరిలోకి దిగిన ఈ 18 ఏండ్ల కుర్రాడు..లిరెన్(6.5)ను కట్టిపడేస్తూ 7.5 పాయింట్లతో టైటిల్ ఒడిసిపట్టుకున్నాడు. గేమ్‌కు ముందు ఇద్దరు 6.5 పాయింట్లతో సమంగా ఉండగా, విజేతను నిర్ణయించే ఈ పోరులో గుకేశ్‌కు అదృష్టం కలిసోచ్చింది. నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఫైనల్ గేమ్ పోరు 58 ఎత్తుల్లో ముగిసింది. అప్పటి వరకు కనీసం డ్రా కోసమైనా ప్రయత్నం చేద్దామనుకున్న గుకేశ్‌కు లిరెన్ చేసిన ఘోర తప్పిదం ప్రపంచ విజేతగా నిలిచేలా చేసింది.

55 ఎత్తులో లిరెన్ వేసిన తప్పటడుగుతో ఒకింత ఆశ్చర్యపోయిన గుకేశ్ గేమ్‌ను మరో మూడు ఎత్తుల్లోనే ముగించి తన కలను సాకారం చేసుకున్నాడు. విజయం తనదేని భావించిన ఈ కుర్రాడు..ఒకింత భావోద్వేగానికి గురయ్యాడు. ఆనందంతో ఉబికి వస్తున్న కన్నీటిని రెండు చేతులతో ఆపుకుంటూ విజయాన్ని ఆస్వాదించాడు. గేమ్ ముగిసిన తర్వాత అభిమానులకు అభివాదం చేస్తూ కనిపించాడు. సుదీర్ఘ ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ చరిత్రలో టైటిల్ గెలిచిన పిన్న వయసుగా ప్లేయర్‌గా గ్యారీ కాస్పరోవ్(22 ఏండ్లు, రష్యా) రికార్డును చెరిపేస్తూ గుకేశ్ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. దీనికి తోడు ఐదు సార్లు ప్రపంచ విజేత విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలిచిన రెండో భారత ప్లేయర్‌గాను నిలిచాడు.



## ఆర్‌ఆర్‌ఆర్ సినిమాపై డాక్యుమెంటరీ.. ఏ ఓటీటీలో ఎప్పుడు స్ట్రీమింగ్ కానుందంటే?

దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో జూ ఎన్టీఆర్, రామ్ చరణ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన RRR భారీ విజయాన్ని అందుకుంది. అంతేకాదు ఇందులోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ అవార్డు కూడా వచ్చింది. జేమ్స్ కెమరూన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ వంటి ప్రముఖ దర్శకులు 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రాన్ని ప్రశంసించారు. విదేశాల్లోనూ ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన ఒక డాక్యుమెంటరీని రూపొందించబోతున్నారు. ఈ నెలలో నెట్‌ఫ్లిక్స్‌లో RRR బిహైండ్ అండ్ బియాండ్' అనే డాక్యుమెంటరీ విడుదల కానుంది. ఈ డాక్యుమెంటరీ పోస్టర్ ఇప్పటికే విడుదల కాగా, ఆ పోస్టర్‌లో రాజమౌళి స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. దీనికి 'ప్రపంచం కీర్తిని చూసింది, ఇప్పుడు దాని వెనుక ఉన్న కథను చూస్తుంది' అని క్యాప్షన్ ఉంది. ఆర్‌ఆర్ ఆర్ సినిమా కథ ఎలా పుట్టింది, కథ పెరిగిన విధానం, కోవిడ్ వల్ల ఎదురుదెబ్బలు, ఆ తర్వాత మళ్లీ షూటింగ్ స్టార్ట్ కావడం, ఎదుర్కొన్న సమస్యలు.. ఇలా ఎన్నో విషయాలను ఈ డాక్యుమెంటరీ ద్వారా రాజమౌళి పంచుకోనున్నారని సమాచారం.



## అఖండ 2 పై అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చిన బోయపాటి.!

చాలా రోజుల నుంచి నందమూరి అభిమానులు వేచి చూస్తున్న రోజు రానే వచ్చేసింది. అఖండ 2పై అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఓ వైపు సంక్రాంతికి డాకూ మహరాజ్ అంటూ బాక్సాఫీస్‌పై యుద్ధం ప్రకటించిన బాలయ్య.. ఈలోపే అఖండ 2ను సైతం సిద్ధం చేస్తున్నారు. అసలు ఈ సీక్వెల్‌పై టీం ఇచ్చిన అప్‌డేట్ ఏంటి..? దీని షూటింగ్ డీటైల్స్ ఏంటి..? బాలయ్య స్పీడ్ చూస్తుంటే కుర్ర హీరోలకు కూడా కుళ్లు వచ్చేస్తుంది. అసలు అదేం స్పీడ్ అండీ బాబూ.. చాలా రోజుల నుంచి నందమూరి అభిమానులు వేచి చూస్తున్న రోజు రానే వచ్చేసింది. అఖండ 2పై అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఓ వైపు సంక్రాంతికి డాకూ మహరాజ్ అంటూ బాక్సాఫీస్‌పై యుద్ధం ప్రకటించిన బాలయ్య.. ఈలోపే అఖండ 2ను సైతం సిద్ధం చేస్తున్నారు. అసలు ఈ సీక్వెల్‌పై టీం ఇచ్చిన అప్‌డేట్ ఏంటి..? దీని షూటింగ్ డీటైల్స్ ఏంటి..? బాలయ్య స్పీడ్ చూస్తుంటే కుర్ర హీరోలకు కూడా కుళ్లు వచ్చేస్తుంది. అసలు అదేం స్పీడ్ అండీ బాబూ.. ఓ వైపు రాజకీయాలు చేస్తూనే మరోవైపు ఒప్పుకున్న సినిమాలను కూడా ఎడాపెడా పూర్తి చేస్తున్నారు. బాలయ్య స్పీడ్ చూస్తుంటే కుర్ర హీరోలకు కూడా కుళ్లు వచ్చేస్తుంది. అసలు అదేం స్పీడ్ అండీ బాబూ.. ఓ వైపు రాజకీయాలు చేస్తూనే మరోవైపు ఒప్పుకున్న సినిమాలను కూడా ఎడాపెడా పూర్తి చేస్తున్నారు. అప్పటి వరకు 40 కోట్లు దాటని %చీదీఖ% మార్కెట్‌కు 100 కోట్ల ఊపొచ్చింది.





## ప్రియుడితో కలిసి పెళ్లిపీటలెక్కిన కీర్తి సురేశ్.. గోవాలో గ్రాండ్ వెడ్డింగ్..

మహానటి కీర్తి సురేశ్ తన జీవితంలో కొత్త ఆధ్యాయానికి శ్రీకారం చుట్టింది. తన బాయ్ ఫ్రెండ్ ఆంటోని తట్టిల్ తో కలిసి గురువారం వైవాహిక బంధంలోకి అడుగు పెట్టింది. ప్రస్తుతం వీరి పెళ్లి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ పెళ్లి ఘనంగా జరిగింది. పెళ్లి డేట్‌ను ముందు నుంచి సీక్రెట్‌గా ఉంచుతూ వచ్చిన కీర్తి, తాజాగా తన సోషల్ మీడియా పేజ్‌లో పెళ్లి ఫోటోలు షేర్ చేసింది. తన లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోని తట్టిల్‌ను పెళ్లి చేసుకుంది కీర్తి. గోవా వేదికగా గురువారం జరిగిన ఈ వివాహ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. హిందూ సాంప్రదాయ పద్ధతిలో కీర్తి సురేశ్ వివాహ జరిగినట్లు తెలుస్తోంది. అలాగే క్రిస్టియన్ పద్ధతిలోనూ పెళ్లి జరుగనుందన్న టాక్ కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం కీర్తి సురేశ్ పెళ్లి ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి. వీటిని చూసిన పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు కొత్త జంటకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా ఈ ఏడాది దీపావళి రోజున ఆంటోనీ తట్టిల్ తో తన ప్రేమ విషయాన్ని బయటపెట్టింది కీర్తి సురేశ్. '15 ఏళ్ల తమ స్నేహ బంధం ఇకపై జీవితాంతం కొనసాగుతుంది' అని ఇద్దరూ కలిసున్న ఫొటోను షేర్ చేసింది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020